విలేకరులు కావలెను
చట్టం మీ చుట్టం
ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే
చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల
వ్యాప్తంగా విలేకరులు కావలెను.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9581419999

చట్టం మీ చుట్టం
జాతీయ తెలుగు దిన పత్రిక

# అసోంలో కూలిన సుఖోయ్ యుద్ధవిమానం

### ఇద్దరు పైలట్లు దుర్మరణం

**ఒకరు ఆపరేషన్ సిందూర్ పైలట్ పూర్వేశ్ దురాగ్కర్**

**న్యూఢిల్లీ, మార్చి6 :** అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్‌లో భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్ జెట్ కూలి పోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు



మిగతా 3వ పేజీలో..

సంపుటి : 14 ● సంచిక : 54 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi శనివారం 7 మార్చి 2026 ● పేజీలు : 8 ● వెల 2/-

# అమెరికా ఆస్తులపైనే మా దాడులు

### అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు

### ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే

**న్యూఢిల్లీ,మార్చి6 (చట్టం న్యూస్):** పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడించారు. తమ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన



మిగతా 2వ పేజీలో..

# టిటిడి పూర్తిస్థాయి ఇవోగా ముద్దాడ

### బాధ్యతలు స్వీకరించిన రవిచంద్ర

**తిరుమల,మార్చి6 (చట్టం న్యూస్):** టిటిడి పూర్తిస్థాయి ఇవోగా ముద్దాడ రవిచంద్ర తిరుమల వేంకటేశ్వరుడి ఆలయంలో శుక్రవారం ఉదయం 7.34 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన టీటీడీ పాలక మండలి సభ్య కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ



మిగతా 2వ పేజీలో..

# సివిల్స్ ఫలితాలు విడుదల

### సత్తా చాటిన తెలుగు అభ్యర్థులు

### అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్




**న్యూఢిల్లీ,మార్చి6 (చట్టం న్యూస్):** సివిల్స్ పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఈ పరీక్షల్లో అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. రాజేశ్వరి సువే రెండో స్థానంలో నిలిచారు. ఆకాన్ష్ ధుల్ మూడో ర్యాంక్ పొందారు. రాఘవ్ ఝున్‌ఝున్ వాలా నాలుగో ర్యాంక్ సాధించారు. ఈ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల్లోని అభ్యర్థులు సత్తా చాటారు. సృజన (55వ ర్యాంక్), డీఎస్‌కే ప్రచేత్ (193వ ర్యాంక్), ఎస్. వర్షిత్‌రెడ్డి (259వ ర్యాంక్), ఎం.పవన్‌కుమార్‌రెడ్డి (297వ ర్యాంక్), వి. విక్రమసింహారెడ్డి (541వ ర్యాంక్), గుమ్మల శ్వేత (573వ ర్యాంక్), పోతుపురెడ్డి భార్గవ్ (537వ ర్యాంక్), పుడారి రాహుల్ (748వ ర్యాంక్), కత్తిమాని అనిరుధ్ (786వ ర్యాంక్), కోరపాతుల శ్రీకర్‌రాజు (806వ ర్యాంక్), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823 ర్యాంక్), కట్టా ప్రత్యూష (908వ ర్యాంక్), గోగుల రాజశేఖర్ (920వ ర్యాంక్),

మిగతా 2వ పేజీలో..

# అసంపూర్తిగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు

### వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి

### సిఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

**హైదరాబాద్,మార్చి6(చట్టం న్యూస్):** అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న రూ. 1.85 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టుల కేటాయింపులు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి మీద ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో 2,800 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మరో 2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. తద్వారా తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన జిల్లాలతో కలిపి మొత్తం 33 జిల్లాలు కూడా తక్కువ సమయంలోనే



జాతీయ రహదారులతో అనుసంధానించామని..

మిగతా 3వ పేజీలో..

# జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం

- వైసిపి వల్ల 30 ఏళ్లు వెనక్కి వెళ్లిన రాష్ట్రం
- ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రూ. 3.32లక్షల కోట్ల బడ్జెట్
- పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం
- వైసిపి విద్యుత్ కొనుగోళ్ళతో రూ.12,250కోట్ల నష్టం
- విద్యుత్ సంస్థలకు రూ.1.29 లక్షల కోట్లు నష్టం
- రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగం
- రాష్ట్రాన్ని నిలబెట్టాలనే కూటమి కోసం పాటుపడ్డా
- ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



**అమరావతి,మార్చి6 (చట్టం న్యూస్) :** జగన్ హయాంలో ఆర్థిక విధ్వసం చేసి, ఏపీని గందరగోళంలోకి నెట్టివేశారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ 30ఏళ్లు వెనక్కు వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. మంత్రి పయ్యావుల కేశవ్ అసెబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 3.32లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సామాజిక భద్రత పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఇలాంటి పరిస్థితిని తట్టుకోవటం, పథకాలు ఇవ్వటానికి సీఎం చంద్రబాబుకు ఎంతో ధైర్యం ఉండాలని ప్రశంసించారు. ఈ సందర్భంగా 'నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదని... భావితరాల కోసం' అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తులను పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. బడ్జెట్ లో చంద్రబాబు దూరదృష్టి, దక్షత, దార్శనికత అడుగడుగునా ఉందని కొనియాడారు. వైసీపీ హయాంలో చేపట్టిన విద్యుత్ కొనుగోళ్ల కారణంగా డిస్కంలకు రూ.12,250కోట్ల నష్టం వచ్చిందని చెప్పుకొచ్చారు. కరెంట్ సరఫరాలో కూడా ఇబ్బందులు వచ్చాయని వివరించారు. రూ.1.29 లక్షల


మిగతా 2వ పేజీలో..

# 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్

- సోషల్ మీడియాతో పిల్లలు నష్టపోవడానికి వీల్లేదు
- అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- 25 నూతన పాలసీలతో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- 3 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం
- పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం
- స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్
- లడ్డూ కల్తీ జరిగినా ఇంకా క్షమాపణలు చెప్పరా
- అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో సిఎం బాబు

**అమరావతి,మార్చి6 (చట్టం న్యూస్):** రాష్ట్రంలో 13 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలను బ్యాన్ చేసే అంశంపై చర్చిస్తున్నామని

మిగతా 2వ పేజీలో..



# ఇజ్రాయిల్‌పై తీవ్రమైన ఇరాన్ ప్రతిదాడులు

### డిమోనా అణు కేంద్రంపై దాడికి ఇరాన్ గురి

**టెహ్రాన్,మార్చి6(చట్టం న్యూస్) :** ఇజ్రాయిల్ దాడులకు ప్రతిదాడులను ముమ్మరం చేసిన ఇరాన్ ఇజ్రాయెల్ అణు రియాక్టర్‌పై గురిపెట్టిందన్న వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయిల్ అణు కేంద్రాన్ని ధ్వంసం చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ తన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను డిమోనాకు రక్షణగా మోహరించింది. ప్రపంచంలోనే అత్యంత దుర్భేద్యమైన ప్రదేశంగా మార్చేసింది. ఇక్కడ యారో-2, 3, డేవిడ్ స్లింగ్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇటీవల తన అత్యాధునిక ఐరన్ బీమ్‌ను కూడా ఇక్కడికే తరలించినట్లు కథనాలు వెలువడ్డాయి. అంతేకాదు.. భూగర్భంలో కొన్ని అంతస్తుల కింద తన అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ సురక్షితంగా ఉంచినట్లు తెలుస్తోంది. డిమోనాపై దాడి చేయడానికి ఇరాన్ అమ్ములపొదిలో డ్రోన్లు, క్షిపణులు వంటి చాలారకాల ఆయుధాలు ఉన్నాయి. రియాక్టర్ నుంచి ఇరాన్ 1200-1500 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంత దూరం ప్రయాణించేందుకు టెహ్రాన్ అమ్ముల పొదిలో షహెద్ 136 డ్రోన్లు భారీ సంఖ్యలో ఉన్నాయి. ఇది దాదాపు

# అన్ని వర్గాలకు లబ్ది చేకూర్చే యత్నం

- ఉచిత సిలిండర్లతో మహిళలపై భారం తగ్గించాం
- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం
- సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేశాం
- మండలిలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

**అమరావతి,మార్చి6 (చట్టం న్యూస్):** కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. 'ఫ్యామిలీ బడ్జెట్' అని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బడ్జెట్‌పై చర్చలో ఇతర విషయాలు రావడం బాధాకరమన్నారు. శాసనమండలిలో



ఆయన మాట్లాడుతూ.. ద్రవ్యవినిమయ బిల్లుపై మాట్లాడారు. మహిళలకు ఉచిత సిలిండర్లు ఇచ్చి ఆర్థిక భారం

మిగతా 2వ పేజీలో..

# ఎపి శాసనసభ నిరవధిక వాయిదా

### 15 రోజులు సమావేశాలు జరిగాయి

**వివరాలు వెల్లడించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

**అమరావతి,మార్చి6 (చట్టం న్యూస్):** ఏపీ శాసనసభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అసెంబ్లీ సమావేశాలు జరిగేందుకు సహకరించిన అందరికీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృతజ్ఞతలు తెలిపారు. 16వ శాసనసభ ఐదో సమావేశాలు 15 రోజుల పాటు జరిగాయన్నారు. 72 గంటల 14 నిమిషాల పాటు సమావేశాలు జరిగాయని స్పీకర్ తెలిపారు. మొత్తం 122

మిగతా 2వ పేజీలో..

# మరోమారు బొత్సకు అస్వస్థత

- బిపి హెచ్చు తగ్గులతో అలసట
- వెంటనే వైద్యులను పిలిపించి పరీక్షలు



**అమరావతి,మార్చి6 (చట్టం న్యూస్):** శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మరోమారు అస్వస్థతకు గురయ్యారు. సభలో ప్రసంగిస్తూ ఇబ్బందిపడటంతో అక్కడి అధికారులు అత్యవసరంగా అసెంబ్లీకి వైద్యులను పిలిపించారు. పరీక్షించిన వైద్యులు.. బీపీలో హెచ్చుతగ్గుల వల్లే అస్వస్థతకు గురైనట్లు వెల్లడించారు. ఆయనకు విశ్రాంతి అవసరమని స్పష్టం చేశారు. వైద్యుల సూచన మేరకు బొత్స ఇంటికి బయల్దేరారు. సభలో ప్రసంగించేటప్పుడు పరిస్థితిని గమనించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆయన్ను విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంది. హైబీపీతో

మిగతా 2వ పేజీలో..

# శ్రీవారిని దర్శించుకున్న కవిత దంపతులు

**నలుగేళ్ల మనోవేదనకు తెరపడిందని ఆనందం**

**తిరుమల,మార్చి6 (చట్టం న్యూస్):** నాలుగేళ్లుగా తాను పడుతున్న మనోవేదన వేంకటేశ్వరస్వామి దయతో తీరిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తిరుమల శ్రీవారిని ఆమె దర్శించుకున్నారు. తన భర్తతో కలిసి శుక్రవారం వేకువజామున శ్రీవారి అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శన అనంతరం

మిగతా 2వ పేజీలో..



# అయోధ్యలో అమితాబ్ భూమి కొనుగోలు

### రూ.35 కోట్లతో 2.67 ఎకరాల భూమి సేకరణ

**అయోధ్య,మార్చి6 (చట్టం న్యూస్):** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రముఖ ఆధ్యాత్మిక నగరం అయోధ్యలో బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ భారీ పెట్టుబడి పెట్టారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ హౌస్ ఆఫ్ అభినందన్ లోధా నుంచి రూ.35 కోట్లతో 2.67 ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని కొనుగోలు చేశారు. సంబంధిత లావాదేవీని శుక్రవారం పూర్తి చేసినట్లు లోధా సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. అయోధ్యలో అమితాబ్ ఇప్పటికే పలు పెట్టుబడులు పెట్టారు. ఒక్క లోధా ప్రాజెక్ట్‌ల్లో మూడు చోట్ల, మొత్తంగా అయోధ్యలో నాలుగు చోట్ల పెట్టుబడులు పెట్టారు. అయోధ్య రామ మందిరానికి దగ్గర్లో లోధా సంస్థ అభివృద్ధి చేసిన సరయు ప్రాజెక్ట్‌లో 2024 జనవరిలో అమితాబ్ తొలుత స్థలం కొనుగోలు చేశారు. ఈ ప్రాజెక్ట్‌కు దగ్గర్లోనే తాజాగా మరో స్థలాన్ని అమితాబ్



మిగతా 2వ పేజీలో..

# 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్

మొదటి పేజీ తరువాయి..

ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవడానికి వీల్లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనంపై ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఓ సిఫార్సు కూడా చేశారని సీఎం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం ప్రసంగించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవద్దనే సంకల్పానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నారు. స్వప్రయోజనాల కోసం సాంకేతికతను ఉపయోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చుని , దానికి బానిసై చెడుకు ఉపయోగిస్తే నాశనమవుతారని అన్నారు. 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని సూచన వచ్చిందని, వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతామని, 13-16 ఏళ్ల లోపు వారికి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి అవినీతిని కట్టడి చేశామని సీఎం చెప్పారు. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను మారుస్తున్నామని.. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు వేశారని ముఖ్యమంత్రి వివరించారు. 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకున్నారన్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలల నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. 9 కోట్ల పనిదినాలు కల్పించేలా కూడా ఉపముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని సీఎం తెలిపారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగిందన్నారు. బ్జడెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్ధంగా వినియోగించుకుందామన్నారు సీఎం. పల్లెల్లో కొత్త వెలుగులు చూసేందుకు ఉప ముఖ్యమంత్రి తీసుకుంటున్న కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలోనూ వివిధ సంస్కరణల్ని అమలు చేసి నైపుణ్యం పెంచేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసుకున్నామని సీఎం తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నామని.. మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు అనుమతితో కర్నూలుకు హైకోర్టు బెంచ్ సాధించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై సంకల్పం చేస్తామన్నారు. ఉగాదికి 3 లక్షల గృహ ప్రవేశాలు చేయించేలా చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు ముఖ్యమంత్రి. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గిన్నీస్ రికార్డు సాధించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డేను నిర్వహించామన్నారు. యోగా, నేచురోపతి లాంటి అంశాలను మేళవించి ప్రజారోగ్యాన్ని కాపాడతామని తెలిపారు. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైట్ కాలర్ క్రైమ్స్, డిజిటల్ క్రైమ్స్, సైకోలు సోషల్ మీడియాలో అరాచకం చేస్తున్నారని.. మహిళలపై నేరాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. మావోయిస్టులను కట్టడి చేశామని.. ఫ్యాక్షనిజాన్ని రూపుమాపామని తద్వారా ప్రగతి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చిందని.. 'పెళ్లికి వెళ్తే కూడా రప్పా రప్పా అంటూ దాడులు చేయాలా? భద్రతకు వెళ్లిన ఎస్ఐ గాయపడేలా పర్యటనలు ఉంటాయా? గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను పక్కన పెట్టుకునే నాయకుడు ఎక్కడైనా ఉంటారా? కటౌట్లకు పొట్టేళ్లతో రక్తాభిషేకం చేయటం ఏమిటి? ఇంత నేరుగా హింసను ప్రోత్సహిస్తారా?' అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టు మార్టానికి కారకులైన వారు పోస్టు మార్టానికే వెళ్తారని ముఖ్యమంత్రి హెచ్చరించారు. 'రాష్ట్రంలో ఈ విధ్వంస యాత్రలు ఏమిటి.. టైర్ల కింద మనుషుల్ని తొక్కించి నింద ప్రభుత్వంపై వేస్తారు. పరామర్శలకు వెళ్లి బలప్రదర్శనలు చేయటం ఏమిటి. 5 కిలోమీటర్లను 6-7 గంటల ప్రయాణం ఎవరైనా చేస్తారా? ప్రతిపక్షంలో ఉండి పెట్టుబడులు రాకుండా ఇష్టానుసారం మాట్లాడతారా? మేం అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ హెచ్చరికలు చేయటం ఏమిటి? దేశంలో ఏ రాజకీయ పార్టీ ఈ విధంగా వ్యవహరించలేదు' అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని సీఎం విమర్శించారు. తెలియకుండా జరిగిన నేరంకాదని.. కుట్రతోనే కావాలని చేసిన నేరం ఇది అని అన్నారు. ఏడు కొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే ఈ కుట్ర కొనసాగుతోందని వ్యాఖ్యలు చేశారు. ఎన్డీడీబీ ఇచ్చిన నివేదికలో కూడా 'అది కల్తీ నెయ్యి' అని స్పష్టంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా హిందూ మఠాలు, పీఠాలు ముక్త కంఠంతో వ్యతిరేకించినా కనీసం ఆ పార్టీ క్షమాపణ చెప్పలేదని సీఎం అన్నారు. ప్రభువా క్షమించు అంటూ సాక్షి పత్రికలో పెద్ద ఎత్తున వార్తలు రాయించుకున్న వ్యక్తి నైవేద్యం కల్తీ చేసి క్షమాపణలు చెప్పరా అని నిలదీశారు. మత సామరస్యాన్ని గౌరవిస్తూ క్షమాపణ చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనమండలిలోనూ ఇదే అంశంపై గొడవ చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీస్తారా అంటూ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా అన్ని పథకాలు కొనసాగిస్తున్నామని, వచ్చే ఏడాదికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు.

# జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం

మొదటి పేజీ తరువాయి..

కోట్లు విద్యుత్ సంస్థలు నష్టపోయాయని.. ఆ భారాన్ని ప్రజలపై మోపారని ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రూఅప్ చార్జీలు రద్దు చేసి ట్రూడౌన్ పేరిట ఛార్జీలు తగ్గించామని ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వం రూ.9లక్షల కోట్ల మేర అప్పులు తమపై ఉంచి వెళ్లిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. రూ.35వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని.. అందులో రూ.25వేల కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా రూ.7వేల కోట్లకు పైగా జత చేశామని వెల్లడించారు. గతంలో వైసీపీ రాష్ట్ర వాటా ఇవ్వకపోవటం వల్ల రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగమయ్యాయని చెప్పుకొచ్చారు. వైసీపీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేసిన అనేక ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వంలో ప్రారంభించామని తెలిపారు. జలజీవన్ మిషన్‌కు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వైసీపీకి 11మంది సభ్యులున్నా 11వందల మంది ఉన్నట్లుగా మాట్లాడుతారని పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు చెప్పే అసత్యాలు కూడా ప్రజలు నిజాలని బలంగా నమ్మే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. ఇతరుల స్వేచ్ఛను, హక్కులను హరించటం తమ హక్కని వైసీపీ భావిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి అసభ్య పదజాలంతో మాట్లాడే వారిని కట్టడి చేయాలని కోరారు. దోపిడి చేసే దొంగ పోలీసులను చూసి.. దొంగే దొంగ అని అరిచినట్లుగా జగన్ అండ్ కో తీరు ఉందని సెటైర్లు గుప్పించారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. కల్తీ వాళ్లే చేస్తారని... నిందలు మాత్రం కూటమి ప్రభుత్వంపై మోపుతారని పవన్ కల్యాణ్ ఆగ్రహించారు. ఎవరు ఎమ్మెల్యేగా గెలవాలన్నా.. అన్ని కులాల వాళ్లు ఓట్లు వేయాల్సిందేనని తెలిపారు. ఈ మధ్య కొందరు ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటున్నారని ఫైర్ అయ్యారు. ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటే రాష్ట్రం నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కులం దాటకపోతే ఏపీ విచ్ఛిన్నమవుతుందని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా మనమే చెప్పాలని అన్నారు. లేకపోతే ఎంత బ్జడెట్ పెట్టినా ఉపయోగం ఉండదని చెప్పుకొచ్చారు. పోలవరం, అమరావతిని వైసీపీ పక్కన పెట్టిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి నేతలందరం ఐక్యంగా ముందుకెళ్దామని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. కూటమి చాలా బలంగా ఉండాలనేది తన ఆకాంక్ష అని ఉద్ఘాటించారు. ఏపీ అభివృద్ధి కోసమే 2014లో అలయన్స్ కోసం కష్టపడ్డానని తెలిపారు. 2019లో అది సాధ్యం కాలేదని.. 2024లో మరోసారి వెనక్కు తగ్గి పొత్తు పెట్టుకున్నానని ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలంటే మనలో ఏదైనా చిన్నచిన్న సమస్యలున్నా సర్దుకోవాలని దిశానిర్దేశర చేశారు. రాజ్యాంగంలోని మూడు వ్యవస్థలు పరస్పర సహకారంతో పని చేయాలని తెలిపారు. ఏ వ్యవస్థలో లోపాలు ఏర్పడినా ప్రజలకు సేవ చేయటంలో ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. జగన్ అండ్ కో కుట్రలను ఎదుర్కోవాలంటే మనం కలిసి ఉండాలని పవన్ కల్యాణ్ సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిధులను పారదర్శకంగా ఖర్చు చేశామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు ఎవరొచ్చినా వారు అడిగింది ఇవ్వటానికి తాను ప్రయత్నించానని పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా తన శాఖల తరపున ఇచ్చిన నిధుల వివరాలు అందజేస్తున్నానని తెలిపారు. బ్జడెట్ వస్తుందంటే ప్రతి ఒక్కరూ ఎన్నో ఆశలుపెట్టుకుంటారని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 15సంవత్సరాలు ఏపీ కోసం కూటమి పని చేస్తుందని వ్యాఖ్యానించారు. కూటమి బలంగా ఉండాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారని అన్నారు. మంత్రులు కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్ తమ శాఖల్లో బాగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. పర్యాటక రంగంలో రూ.20వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వివరించారు. ధాన్యం రైతులకు 24గంటల్లో డబ్బులు జతచేశామని వెల్లడించారు.

మూడువేల గ్రామాల్లో తాగునీటి సమస్య గుర్తించామని... అక్కడ తొలి ప్రాధాన్యంగా నీరు ఇస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఏపీవ్యాప్తంగా 48వేల జనావాసాల్లో సురక్షిత తాగునీరు ఇవ్వాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. 2019 నుంచి 2024 మధ్య ఉపాధి హామీ పథకంలో రూ.610కోట్లు రోడ్ల కోసం ఖర్చు చేశారని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.3,853కోట్లు రోడ్ల కోసం ఖర్చు చేశామని తెలిపారు. ఐదేళ్లలో 880 కిలోమీటర్లు సీసీ రోడ్లు వేస్తే మనం 6వేల కిలోమీటర్లు వేశామని వెల్లడించారు. వైసీపీ హయాంలో అన్ని రోడ్లు 8,500కిలోమీటర్లు వేస్తే... మనం రెండేళ్లలో 17,500 కిలోమీటర్ల రోడ్లు వేశామని తెలిపారు. చిట్టచివర్లో ఉన్న ప్రజానీకానికి కూడా ప్రభుత్వ ఫలాలు అందాలనే లక్ష్యంతో తాము పనిచేశామని పేర్కొన్నారు. ఇన్ని కష్టాలు, నష్టాలున్నా 11.75 ఆర్థిక వృద్ధిరేటు చూపించిన సీఎం చంద్రబాబుకు అభినందనలు. కోటి 11లక్షల సివిల్ కేసులు, 3కోట్లకు పైగా క్రిమినల్ కేసులు దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ చెప్పారని అన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని గవర్నర్ సూచించారన్నారు. మన వద్ద ఉన్న కోర్టుల సంఖ్య, సిబ్బంది సంఖ్య ప్రకారం ఈ కేసులు ఎప్పటికీ పరిష్కారమవుతాయో చెప్పలేమని అన్నారు. చాలా కోర్టుల్లో కనీస సౌకర్యాలు లేవని.. మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు లేవని... న్యాయశాఖకు సరిపడా నిధులు బ్జడెట్‌లో కేటాయించాలని కోరుతున్నామని పేర్కొన్నారు. ఈ బ్జడెట్‌లో 100 కోర్టు గదులకు నిధులు కేటాయించటం సంతోషమని చెప్పుకొచ్చారు. ఎవరిపైన కేసు నమోదైనా అది వ్యక్తిగతం కాదని.. వారి కుటుంబం పైనా ప్రభావం చూపిస్తుందని తెలిపారు. వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని గవర్నర్ సూచించారని అన్నారు. కోర్టుల్లో మౌలిక సౌకర్యాలు, సాంకేతిక వ్యవస్థ ఏర్పాటు చేయటం అత్యవసరమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ఇజ్రాయిల్‌పై తీవ్రమైన ఇరాన్ ప్రతిదాడులు

మొదటి పేజీ తరువాయి..

50 కిలోల పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. ఇక క్షిపణుల విషయానికి వస్తే సాహబ్-3, ఖైబర్‌షేకన్, ఎమాద్, ఖుర్రంషహర్, ఘద్ర, సెజ్జిల్, సుమర్ వంటి క్షిపణులున్నాయి. వీటి రేంజి 1300 కిలోమీటర్ల నుంచి 2500 కిలోమీటర్ల వరకు ఉంది. ఇవికాకుండా ఫతా-2 హైపర్ సోనిక్ క్షిపణి కూడా ఉంది. ఇది ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా తప్పించుకోగలదు. గతంలో సిరియాతో ఘర్షణ వేళ ఈ రియాక్టర్ సమీపంలో కొన్ని క్షిపణులు పడ్డాయి. ఇజ్రాయెల్ ఏర్పడిన తర్వాత పొరుగు దేశాలు వరుసగా దానితో యుద్ధాలకు దిగాయి. అమెరికా సాయంతో.. వాటిని ఓడించినా.. ఎప్పటికైనా తన ఉనికికి ముప్పు తప్పదని గ్రహించింది. దీంతో నాటి ప్రధాని డేవిడ్ బెన్ గురియన్ తమ దేశాన్ని అణుశక్తిగా మార్చాలనే నిర్ణయానికి వచ్చారు. ఫ్రాన్స్ సాయంతో అణు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు నెగెవ్ ఎడారిలో 'డిమోనా' అనే ప్రదేశంలో ఓ భారీ రియాక్టర్‌ను ఇజ్రాయెల్ నిర్మించింది. ఐరోపా దేశాల టెక్నాలజీ, బ్లూప్రింట్స్, నిపుణుల సాయంతో దీనిని రూపొందించారు. ఇందులోని భూగర్భ బంకర్లలో అణుబాంబులకు వాడే ప్లుటోనియం ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఈ విషయం అతికొద్దిమందికి మాత్రమే తెలుసు. అలా ఇజ్రాయెల్ అణ్వాయుధం తయారీలో డిమోనా రియాక్టర్ కీలక పాత్ర పోషించింది. ఈ రియాక్టర్‌కు ఉత్తరం వైపు 85 కిలోమీటర్ల దూరంలో జెరూసలెం నగరం ఉంది. ఇక 75 కిలోమీటర్ల దూరంలో ఈజిప్ట్ సరిహద్దులు.. 25 కిలోమీటర్ల దూరంలో జోర్డాన్ ఉన్నాయి. ఒకవేళ దాడి జరిగితే ఇక్కడి నుంచి లీకయ్యే రేడియేషన్ ప్రభావం ఈ దేశాలకు కూడా పాకే ప్రమాదం ఉంది.

# మరోమారు బొత్సకు అస్వస్థత

మొదటి పేజీ తరువాయి..

ఇబ్బంది పడుతున్న బొత్స.. మండలిలో మాట్లాడుతుండగా కింద పడబోయారు. దీంతో వెంటనే అసెంబ్లీ అధికార వర్గాలు అత్యవసరంగా వైద్యులను పిలిపించి, ఆయన ఛాంబర్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత.. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. బీపీలో హెచ్చుతగ్గులు, సరైన సమయానికి భోజనం చేయకపోవడం వంటి కారణాల వల్ల ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వైద్యులు వివరించారు. విశ్రాంతి తీసుకోవాలని, అవసరమైతే మరిన్ని వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. అలాగే, బొత్సతో హైదరాబాద్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బొత్స సత్యనారాయణ హైబీపీతో ఇబ్బంది పడుతున్నారని, బీపీ కంట్రోల్‌లోకి రాకపోతే హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. దీంతో బొత్సను సహచరులు ఆయన నివాసానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బొత్స సత్యనారాయణ ఆరోగ్యం నిలకడగానే ఉందని సమాచారం. అయితే మూడ్రోజుల విశ్రాంతి అనంతరం శుక్రవారమే బొత్స తిరిగి సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మంత్రి లోకేశ్ ఆత్మీయంగా పలకరించారు. 'బొత్స సత్యనారాయణ గారు నమస్కారం' అంటూ పలకరించారు. బొత్స సత్యనారాయణ వినకపోవడంతో వెంటనే కల్పించుకున్న చైర్మన్.. 'మంత్రి నారా లోకేశ్ మిమ్మల్ని పరామర్శిస్తున్నారు' అంటూ బొత్సకు తెలియజేశారు. వెంటనే మంత్రి మాట్లాడుతూ.. 'గురువుగారు చిన్న అనారోగ్య సమస్యతో బాధపడ్డారు. ఆయన తిరిగి ఆరోగ్యంగా హౌస్‌కు రావడం ఆనందంగా ఉంది' అని మంత్రి లోకేశ్ అన్నారు. ఇటీవల మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

## అమెరికా ఆస్తులపైనే మా దాడులు

మొదటి పేజీ తరువాయి..

సమర్థించారు. యూఎస్ ఆస్తులనే మేం లక్ష్యంగా చేసుకుంటున్నాం. అందుకే మా దాడుల వల్ల అరబ్ దేశాల్లో ప్రాణనష్టం సంభవించలేదని ఖతీబ్జాదే అన్నారు. అలాగే ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా-75ను యూఎస్ ముంచేసిన సంగతి తెలిసిందే. భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడికి వచ్చింది. దానిపై అమెరికా దాడి దురదృష్టకరం అని వ్యాఖ్యానించారు. అలాగే దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఖమేనీ సహా పాలనావర్గానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి వ్యక్తులు చనిపోయారు. వారి మృతితో ఇరాన్ రాజకీయ వ్యవస్థ కూలిపోతుందని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యలు చేస్తోంది. వాటిని ఖతీబ్జాదే తోసిపుచ్చారు. తమ దేశ పాలనా నిర్మాణం వ్యక్తులపై కాకుండా వ్యవస్థలపై ఆధారపడి ఉందని స్పష్టంచేశారు. 'ఇరాన్‌లో రాజ్యాంగం ఉంది. ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహించాలనే దానిపై స్పష్టమైన విభజన ఉంది' అని అన్నారు.

## టిటిడి పూర్తిస్థాయి ఇవోగా ముద్దాడ

మొదటి పేజీ తరువాయి..

అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. వేంకటేశ్వరుడిని దర్శించుకున్న అనంతరం ఈవో దంపతులకు రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా అదనపు ఈవో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గత నెల రోజులుగా తిరుమలలో చాలా విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. తిరుమల యాత్రికులకు సాటి యాత్రికుడిగా సేవ చేస్తానని చెప్పారు. యాత్రికుల నుండి చాలా సలహాలు సూచనలు వచ్చాయని, వాటిని తానే స్వయంగా పరిశీలించి ఆ అనుభవంతో ప్రజలకు మంచి ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు.

## అన్ని వర్గాలకు లబ్ది చేకూర్చే యత్నం

మొదటి పేజీ తరువాయి..

తగ్గించామని అన్నారు. మహిళల సమస్యలు తెలుసు కాబట్టే.. ఉచిత బస్సు సదుపాయం కల్పించామన్నారు. సామాన్యుడికి మేలు చేసేందుకే అన్న క్యాంటీన్లు పెట్టినట్లు వివరించారు. ప్రజా ప్రతినిధులుగా మనం ఏం చేశామన్నదే కీలకం. మనం చేసిన పనులు మాత్రమే చరిత్రలో ఉంటాయి. గత వైకాపా ప్రభుత్వం 153 లక్షల టన్నుల చెత్తను వదిలిపెట్టి వెళ్లింది. ప్రస్తుతం ఆ చెత్తను కూడా తొలగించాల్సి వస్తోంది.బడ్జెట్లో సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చాం. అప్పులు చేయడం తప్పు అని నేనెప్పుడూ చెప్పలేదు. చేసిన అప్పులను ఎలా ఉపయోగిస్తామనేది కీలకం. రాజకీయ దురుద్దేశంతో ప్రతిపక్షనేతలు ఆరోపణలు చేయవద్దని కోరుతున్నానని పయ్యావుల అన్నారు. అంతకుముందు కాగ్ రిపోర్టుపై ప్రతిపక్ష, పాలకపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. రెవెన్యూ, జీఎస్టీ వసూళ్లలో దేశంలో ఏపీ 22వ స్థానంలో ఉందని బొత్స అన్నారు. సున్నా వడ్డీ కింద ఎవరికీ రుణాలు ఇవ్వడం లేదని, మహిళలను లక్షాధికారులను ఎలా చేస్తారో చెప్పాలని నిలదీశారు. పీఎం ఫసల్‌బీమా యోజన అమల్లో లెక్కలు సరిగా లేవని ఆరోపించారు. మొక్కజొన్న, మామిడి, పొగాకు, మిరప, టమాటా, వరికి గిట్టుబాటు ధర రావడం లేదని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల్లో కొన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. 'సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్' అని మీరే అంటే ఎలా? అని ప్రశ్నించారు. బొత్స ఆరోపణలను మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి ఖండించారు. బొత్సకు వచ్చిన జాబితా ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని మంత్రి లోకేశ్ డిమాండ్ చేశారు. ఆరోపణలు చేసినప్పుడు ఆధారాలు ఇవ్వాలని మంత్రి పయ్యావుల కోరగా.. అబద్ధాలు చెప్పాల్సిన అవసరం తమకు లేదని బొత్స అన్నారు.

## ఎపి శాసనసభ నిరవధిక వాయిదా

మొదటి పేజీ తరువాయి..

ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారని... 80 ప్రశ్నలకు సభాసమక్షంలో ఉంచారని చెప్పారు. ఈసారి సమావేశాల్లో 18 బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. ఒక లఘు చర్చ, 344వ నియమం కింద చర్చించిన అంశాలు ఒకటి అని వివరించారు. శాసనసభలో టీడీపీ-135, జనసేన-21, వైసీపీ-11, బీజేపీ-8 మంది సభ్యులున్నారని స్పీకర్ తెలిపారు. ఈరోజు సాయంత్రం సభ్యుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ కుటుంబసమేతంగా రావాలని స్పీకర్ కోరారు. క్రీడాపోటీల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. 166 పాఠశాలల నుంచి 6,693 విద్యార్థులు అసెంబ్లీని సందర్శించారని.. అసెంబ్లీకి ఇంత భారీ సంఖ్యలో విద్యార్థులు ఎప్పుడూ రాలేదని స్పీకర్ అన్నారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు శాసనసభ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేశారు.

## శ్రీవారిని దర్శించుకున్న కవిత దంపతులు

మొదటి పేజీ తరువాయి..



రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. దిల్లీ మద్యం కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో శ్రీవారికి మొక్కులు చెల్లించేందుకు కాలినడకన వచ్చానన్నారు. త్వరలో తెలంగాణలో రాజకీయ పార్టీ స్థాపించనున్నట్లు వెల్లడించారు. తనకు కష్టకాలంలో సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. స్వామి దయ తనపై ఉండడం వల్లనే కేసు నుంచి బయటపడ్డానని అన్నారు.

## అయోధ్యలో అమితాబ్ భూమి కొనుగోలు

మొదటి పేజీ తరువాయి..

తాజాగా కొన్నారు. ఇది కాకుండా 10,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక ప్లాట్‌ను లోధా నుంచి గతంలో కొనుగోలు చేశారు. అమితాబ్ బచ్చన్ పెట్టుబడుల వెనుక దీర్ఘకాలిక వ్యూహం, అయోధ్యపై ఉన్న ఆయకున్న విశ్వాసాన్ని తెలియజేస్తున్నాయని లోధా గ్రూప్ చైర్మన్ అభినందన్ లోధా పేర్కొంది. దేశంలో అతిపెద్ద ల్యాండ్ డెవలపర్‌గా ఉన్న హౌస్ ఆఫ్ లోధా.. ఇప్పటికే పలు నగరాల్లో సేవలందిస్తోంది. దేశవ్యాప్తంగా 48 నగరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# అర్హులైన ప్రతి లబ్ధిదారుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయాలి

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 06,(చట్టం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై మహబూబాబాద్ ఐడీఓసి కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, శాసన సభ్యులు మురళి నాయక్, దొంతి మాధవరెడ్డి, రాజేందర్ రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కూడా చైర్మన్ ఇనుగల వెంకట్రామిరెడ్డి, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నెల 6వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యా మరియు వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను తీర్చాలని, అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని చెప్పారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో కూడా వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి కొరత ఉండకుండా చూడాలని సూచించారు. ఉపయోగంలో లేని వైద్య పరికరాలను తొలగించి, అవసరమైన పరికరాలకు తగిన సిబ్బందిని నియమించి వాటిని సమర్థంగా వినియోగంలోకి తేవాలని పేర్కొన్నారు. పాఠశాలల వాహనాలు ఫిట్ నెస్ లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జిపిఆర్ఎస్ ద్వారా పాఠశాల వాహనాలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

స్లమ్ ఏరియాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, ఉందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి, ఎక్కడైనా నిధులు మంజూరు సమస్య ఉంటే నివేదికలు పంపాలని తెలిపారు. ప్రతి హస్టల్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించి తనిఖీలు చేయాలని, విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాభితా తయారు చేయాలని తెలిపారు. మార్చి నెలాఖరు వరకు ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, గ్రౌండ్ కాని ఇండ్లు లబ్ధిదారుల నుండి అంగీకారాన్ని తీసుకుని రద్దు చేయాలని తెలిపారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార స్థితిని దరఖాస్తుదారులు తెలుసుకునేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి సమాచారం వారి సెల్‌ఫోన్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాలికల వసతి గృహాల్లో ఇన్సినిరేటర్లు ఏర్పాటు చేయాలని, మండల స్థాయిలో ఆరోగ్య సదస్సులు నిర్వహించి వైద్య పరీక్షలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఛైర్మన్‌లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఊరికి ఉపకారం చేయాలనే ఆలోచన అభినందనీయం





### ఎస్సై గంద్ర సంతోష్

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 06,(చట్టం న్యూస్):** ఊరికి ఉపకారం చేయాలనే ఆలోచన చాలా సంతోషకరమని సిరోల్ ఎస్సై గంద్ర సంతోష్ అన్నారు. శుక్రవారం కురవి మండలంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో సూధనపల్లి ఐక్యతే శక్తి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంచీలు, పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పాఠశాలలో మరియు గ్రామ పంచాయతీకి సీ.సీ కెమెరాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధరావత్ వెంకన్న అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా సినీ కళామతల్లి ముద్దుబిడ్డ నంది అవార్డు గ్రహీత రాగిణి , రేడియో జాకీ ,యాంకర్ వేణు శ్రీరామ్, కవి, సినిమా రచయిత, ఆస్ట్రాలజర్ బొల్లోజు భరత్ ,ముఖ్యఅతిథిగా సిరోల్ ఎస్సై గంద్ర సంతోష్ , పాత్రికేయ మిత్రులు మహబూబాబాద్ జిల్లా టియుడబ్ల్యూజే (ఐజేయు) అధ్యక్షుడు శ్రీ చిత్తనూరి శ్రీనివాస్ రావడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై గంద్ర సంతోష్ మాట్లాడుతూ ఊరికి ఉపకారం చేయాలనే ఆలోచనతో తాము చదివిన పాఠశాలకు, పుట్టిన ఊరును అభివృద్ధి పథంలో నడిపించేందుకు తమ వంతుగా సూధనపల్లి ఐక్యతే శక్తి వెల్ఫేర్ అసోసియేషన్ వారు ముందుకు వచ్చినందుకు వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాగిణి మాట్లాడుతూ తాము చదివిన పాఠశాలకు సేవ చేయడం, పుట్టిన ఊరికి తమ వంతు సాయాన్ని అందించడం చాలా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సూధనపల్లి ఐక్యత శక్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు సినీ దర్శకులు నీలం రాజు గారు మాట్లాడుతూ 2025 లో స్థాపించిన ఈ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటగా ప్రభుత్వ పాఠశాల నుంచే మా యొక్క కార్యక్రమాలను అందించడం జరిగింది .గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ప్రభుత్వ పాఠశాలలో బెంచీలు, పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అలాగే పాఠశాలకు మరియు గ్రామపంచాయతీ కి సీ.సీ కెమెరాలను అందించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో శోధన పెల్లి ఐక్యత శక్తి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏ. మధుసూదన్ కోశాధికారి ఎన్. ఉపేందర్, వైస్ ప్రెసిడెంట్ జాయింట్ సెక్రెటరీ మద్దెల రాంప్రసాద్, సూదనపల్లి ఐక్యతే శక్తి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, సూదనపల్లి గ్రామ సర్పంచ్ నీలం వెంకన్న, ఉప సర్పంచ్ వెంపటి విజయ్, వార్డు మెంబర్లు ఏ .లింగన్న వెంబటీ దుర్గయ్య ,వీ .అరుణ శేఖర్, సందు కృష్ణవేణి వెంకన్న, గంగాధరి రజిత వెంకట నరసయ్య, గాండ్ల రజిత సతీష్, ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్ కుమార్, ఎండి. అంజద్ పాషా, జి.బాలరాజు, బి .సరోజ,వి. శుభ ,కే. సారంగం ఏ. ప్రగతి, గ్రామ పెద్దలు, ఏ .ఏ .పీ. సి సభ్యులు విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి బాలికలకు పెన్నులు అట్టలు పంపిణీ చేసిన శివ నాయుడు



**నార్నల మార్చి, 6,(చట్టం) న్యూస్ :** నార్నల మండల కేంద్రంలోబాలికల ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి చదువుకుంటున్న బాలికలకు పేరెంట్స్ కమిటీ ,కోఆప్షన్ సభ్యులు శివ నాయుడు ఆధ్వర్యంలో దాదాపు 171 మంది పదవ తరగతి బాలికలకు పెన్నులు, అట్టలు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా శివ నాయుడు గారు మాట్లాడుతూ అందరూ కష్టపడి మంచి మార్కులు సాధించి ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు అదేవిధంగా మండలంలోని స్కూల్ ఫస్ట్ రావాలని అని అన్నారు ఎవరైతే మండలఫస్ట్ క్లాసులో పాస్ అయినవారికి,నా వంతు వారికి 5,116, గిఫ్ట్ ఇస్తానని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ప్రిన్సిపాల్ నాగేష్ స్కూల్ కమిటీ చైర్మన్ ప్రకాష్ నాయుడు కమిటీ సభ్యులు నరేంద్ర రంగాపురం నాయుడు ఎటుకూరి ప్రసాద్ నాయుడు శ్రీరాములు రాజు అదేవిధంగా ఉపాధ్యాయులు పిల్లలు తదితరు పాల్గొన్నారు




# నీరుగారుతున్న హరిత లక్ష్యం

**కొడిమ్యాల, మార్చి 6 (చట్టం) :** తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలనే లక్ష్యంలో భాగంగా గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టడం ఆనందదాయకం. దీనిలో భాగంగా కొడిమ్యాల మండలంలో ఆయా సమయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు నాటిన కొన్ని మొక్కల ప్రస్తుత స్థితిగతులను ఒకసారి గమనిద్దాం. చాలా చోట్ల మొక్కలు పెరిగి చెట్లుగా మారడంతో కొంత మేర ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతున్నప్పటికీ, కొన్ని చోట్ల ఆ మొక్కలకు పెరుగుదల శాపంగా మారి గొడ్డలి కాటుకు గురై నేలపాలు కావడం జరుగుతుంది. దీనికి ముఖ్య కారణాల్లో ఒకటి ఆ మొక్కలు పెరిగి విద్యుత్ తీగలను తాకడం, అనంతరం వాటిని నరకడం ఏటా ఇదే తంతు జరుగుతుండడంతో కొంత మేర ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది.



# అసోంలో కూలిన సుఖోయ్ యుద్ధవిమానం

మొదటి పేజి తరువాయి..

చనిపోగా.. వారిలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లుగా సమాచారం. ఈ విషయాన్ని పూర్వేష్ తల్లిదండ్రులు మీడియాకు తెలిపారు. పూర్వేష్(28).. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లు అతని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముందుగా ఈ విషయం తమకు తెలియదని.. ఆపరేషన్ సిందూర్ ముగిసిన 15 రోజుల తరువాత తెలిసిందని పూర్వేష్ తండ్రి రవీంద్ర దురాగ్కర్ తెలిపారు. యుద్ధ సమయంలో పూర్వేష్ వద్ద ఫోన్ లేదని.. యుద్ధం ముగిసిన తరువాత పూర్వేష్ తమకు కాల్ చేసి విషయం చెప్పాడని రవీంద్ర తెలిపారు. అస్సాంలో ప్రమాదం జరగడానికి ఒక రోజు ముందు తన కొడుకుతో మాట్లాడినట్లు రవీంద్ర తెలిపారు. ఇంతలోనే ఇలా జరిగిందంటూ కన్నీరమున్నీరయ్యారు. తన కొడుకు భారత వైమానిక దళంలో భాగమైనందుకు చాలా గర్వంగా ఉందన్నారు. పూర్వేష్ ఎప్పుడు మాట్లాడినా యుద్ధ విమానాలను నడిపిన తన అనుభవాన్ని, ఐఏఎఫ్ జెట్‌ల వేగం గురించి ఎంతో ఆసక్తిగా చెబుతుండేవాడని.. తన సహోద్యోగులను ఎంతో గౌరవించేవాడని రవీంద్ర తెలిపారు. 'నా కొడుకు దేశ సేవలో తనను తాను త్యాగం చేసుకున్నాడు. పూర్వేష్ తన కలను నెరవేర్చుకున్నాడు. కానీ, తను కోరుకున్నంతగా దేశానికి సేవ చేయలేకపోయాడు. కేవలం 4 సంవత్సరాలు మాత్రమే పని చేశాడు. పది రోజుల క్రితం మా ఇంటికి వచ్చాడు. తిరిగి విధుల్లోకి చేరిన తరువాత ఇలా జరిగింది.' అంటూ రవీంద్ర విలపించారు. ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్, స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ శిక్షణా మిషన్‌లో ఉన్నారు. జోర్హాట్ వైమానిక స్థావరం నుండి వీరి జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కనిపించకుండా పోయింది. సాయంత్రం 7:42 గంటలకు సుఖోయ్‌తో కమ్యూనికేషన్ కోల్పోయినట్లు తెలిపిన అధికారులు.. జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి 60 కిలోమీటర్ల దూరంలో కూలిపోయినట్లు గుర్తించారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కర్ ఈ తోయిబాలో భాగమైన రెసిస్టెన్స్ ఫ్రంట్ ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారతదేశం మే 7వ తేదీన ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే భారత భద్రతా దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లో ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ తరువాత పాకిస్థాన్.. భారత్‌పై క్షిపణులు, డ్రోన్‌లతో దాడులకు తెగబడగా.. భారత రక్షణ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయి. ప్రతిదాడులతో పాక్‌ను షేక్ చేశాయి. మే 10వ తేదీన ఇరు దేశాలు కాల్పుల విరమణ ప్రకటించారు. దాంతో ఆపరేషన్ సిందూర్ నిలిచిపోయింది.

# అసంపూర్తిగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు

మొదటి పేజి తరువాయి..

ఇది చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూ.265 కోట్ల వ్యయంతో ఔఊ163 (గతంలో ఔఊ-202) మీద నగరంలోని అంబర్‌పేట క్రాస్ రోడ్డు వద్ద 1.5 కిలోమీటర్ల పొడవైన 4 వరుసల ్ణ÷÷-ల ఓవర్‌ను నిర్మించిందని గుర్తుచేశారు. 5 మే, 2025 నాడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ ఫ్లై ఓవర్‌ను ఘనంగా ప్రారంభించారని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తనతోపాటుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఈ ్ణ÷÷-ల ఓవర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తి కాలేదని అన్నారు. దీని నిర్మాణం జరిగి, ప్రారంభోత్సవం కూడా పూర్తి చేసుకున్నప్పటికీ దీని కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తిస్థాయిలో జరగలేదని తెలిపారు. భూసేకరణ విషయంలో కొన్ని శక్తులు అడ్డుతగులుతోండటంతో అనవసరంగా తీవ్ర జాప్యం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది 2018లో మంజూరయినప్పటికీ లేని సమస్యలు సృష్టించి భూసేకరణ పూర్తి కాకుండా కుట్రలు చేసి సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో జరగనివ్వకపోవడంతో ఈ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అప్పటి సీఎం కె. చంద్రశేఖరరావు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి అనేకసార్లు తెలియజేశానని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ మంత్రులకు స్వయంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా అనేకసార్లు తెలియజేశారని అన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, ఇతర సంబంధిత అధికారుల దృష్టికి తాను కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లి అనేకసార్లు మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసినప్పటికీ, ఈ సమస్య ఓ కొలిక్కి రాలేదని చెప్పుకొచ్చారు. భూసేకరణకు సంబంధించిన భూమికి రూ. 2.54 కోట్ల పరిహారం లబ్దిదారులకు ప్రభుత్వం చెల్లించినప్పటికీ మధ్య దళారులు అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ చూపించి, సర్వీసు రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత జీహెచ్ఎంసీ, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకొని సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించటానికి సహకరించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు.

# గ్రీన్ ఇండియా ఛాలెంజ్



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మార్చి 6 ,(చట్టం బ్యూరో) :** తన పుట్టినరోజు సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని వారి కులదైవం పెద్దమ్మతల్లి ఆలయం ఆవరణలో మొక్క నాటిన గుజ్జేటి లక్ష్మీపతి రేణుక కుమార్తె విద్యార్థిని గుజ్జేటి హిమాశ్రీ మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో భాగంగా కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామంలో తన జన్మదినం పురస్కరించుకొని వారి కులదైవం పెద్దమ్మతల్లి ఆలయంలో ఆశీస్సులు తీసుకొని తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ఆవరణలో మొక్క నాటిన గుజ్జేటి హిమాశ్రీ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నా పుట్టిన రోజు సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని మొక్క నాటిన సంతోషంగా ఉందని తెలుపుతూ ఇలానే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరుకుంటున్నాను అని తెలిపారు . ఈ కార్యక్రమంలో పిట్టల మల్లేశం ,మమత గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మెంబర్ కమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నారై ఇఫ్తార్ విందు

**కొడిమ్యాల, మార్చి 6 (చట్టం) :** మండలానికి చెందిన ప్రముఖ ఎన్నారై నేరెళ్ల సత్యంరెడ్డి శుక్రవారం డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ విందులో స్థానిక జేఎన్టీయూ కళాశాలకు చెందిన సుమారు 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. మతసామరస్యం పెంపొందించే విధంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పునుగోటి కృష్ణారావు, నాయకులు నజీర్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



# ఈ యుద్ధం ముగిసేదెలా ?

పశ్చిమాసియా యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. దీనికితోడు ఇది మూడో ప్రపంచ యుద్ధంగా మారబోతుందా అన్న భయాలు వెల్లడవుతున్నాయి. ఎందుకంటే ఇజ్రాయిల్, అమెరికాల దూకుడు తగ్గడం లేదు. ప్రతిగా ఇరాన్ కూడా విధ్వంసం సృష్టిస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే ఇరాన్‌ను అమెరికా తక్కువ అంచనా వేసినట్లుగా అర్థం అవుతోంది. మరోవైపు యుద్ధాన్ని ఆపాలని చైనా, రష్యాలు రంగంలోకి దిగాయి. ఇరాన్‌కు ఈ రెండు దేశాలు మద్దతు ప్రకటించాయి. దీంతో ఏంజరగబోతుందో అన్న ఆందోళన సహజంగానే కలుగుతోంది.తాజాగా చైనా నోరు విప్పడంతో ఈ యుద్ధం కీలకమైన మలుపు తీసుకునే అవకాశం లేకపోలేదు. ఒకవేళ ఇరాన్‌లో రహస్యంగా కొనసాగుతున్న న్యూక్లియర్ రియాక్టర్ ఏ మాత్రం లీక్ అయినా, ఇరాన్, పరిసర ప్రాంతాల్లో ఉన్న దేశాలకు కూడా ముప్పు ముంచుకొస్తుంది. దీనిపై ఇటు ఇరాన్‌కు అటు అమెరికాకు కూడా అవగాహన ఉండివుంటుది. కానీ ఎందుకో ఇరాన్ కూడా తమ దాడుల తీవ్రత పెంచింది. ఈ యుద్ధంతో ఇప్పటికే మధ్య ప్రాచ్యం మండిపోతోంది. ఇరాన్ సార్వభౌమత్వాన్ని కాపాడతామంటూ చైనా రంగంలోకి దిగడంతో ప్రపంచ దేశాల్లో మూడో ప్రపంచ యుద్ధ భయాలు కనపడుతున్నాయి. ఇదే సమయం లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరిన్న భీకర దాడుల్ని చేసేందుకు సిద్ధమౌతున్నట్లు ప్రకటించారు. యుద్ధం మరో నాలుగైదు వారాలు తప్పదని ట్రంప్ ముందే హెచ్చరించారు. ఆ వెనువెంటనే యుద్ధ తీవ్రత ఎలా ఉంటుందో కూడా చెప్పనే చెప్పారు. ఎనిమిది అరబ్దేశాలు ఇరాన్ దాడులతో విలవిల్లాడు తున్నాయి. ఇరాన్ అమెరికాతో రాజీ చర్చల కోసం ఏవిధంగానూ ప్రయ త్నించడం లేదు. మరోవైపు హర్మూజ్ జలసంధి మూసివేయడంతో ప్రపంచం మీద చమురు భారం పడుతోంది. సంక్షోభం తప్పేలా లేదు. అమెరికా మాత్రం చర్చలకు ఆలస్యం అయ్యిందని బెదిరిస్తోంది. ఇరాన్‌లో తదుపరి ఎవరు నేతగా ఉండాలో తామే నిర్ణయిస్తామని కూడా ట్రంప్ ప్రకటించాడు. ఇకపోతే ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాలు ముప్పు ముంగిట ఉన్నాయి. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రం,రిఫైనపై ఇరాన్ దాడి చేయడంతో చమురు సరఫరా ఆగిపోయింది. ఇరాన్ తన హోర్ముజ్ జలసంధిని మూసి వేస్తే ప్రపంచ దేశాలకు అందే చమురు సరఫరా ఆగిపోగలదని అనుభవంఓలకి వచ్చింది. ఈ క్రమంలో బహ్రెయిన్ పోర్టులో ఆగి ఉన్న అమెరికాకు చెందిన స్టెనా ఇంపరేటివ్ చమురు నౌక పైనా డ్రోన్ దాడులు జరిగి మంటలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ప్రధానంగా అమెరికా తదితర దేశాల చమురు నౌకలు దెబ్బతింటే ఆయా దేశాలు ఇక చమురుకు కష్టాలు పడాల్సిందే. ఒకవైపు అమెరికా యుద్ధనౌకల మోహరింపు. మరోవైపు ఇరాన్, రష్యా యుద్ధ నౌకలు సంయుక్త నావికాదళ విన్యాసాల కవ్వింపుతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. యుద్ధ జ్వాలలు మింటికెగయడంతో భారత్ దేశంతో సహా ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు, పప్పు ధాన్యాలు, నూనెల ధరలపై విపరీతమైన ప్రభావం పడుతోంది. ఇప్పటికే దక్షిణ కొరియా, జపాన్, చైనా స్టాక్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. తాజా పరిస్థితుల రీత్యా యుద్ధ సంకేతాలు విస్తరించి ఆయా దేశాలు ఏదో ఓ పక్కకు చేరిపోవడం ఒక్కటే ప్రత్యామ్నాయంగా ఉన్నందున యుద్ధం మరికొంతకాలం తమ ప్రతాపాలను చూపిస్తుంది. యుద్ధం ఆగినా యుద్ధకాలపు ప్రభావాలు అంతత్వరగా ఉపసంహరణ జరుగదు. ఆ తర్వాత కూడా మార్కెట్లు కోలుకోవడానికి, పెరిగిన ధరలు తగ్గడానికి మరెంతో కాలం పడుతుంది. ఎందుకంటే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసేలా లేదు. ఇరువైపులా భీకర యుద్ధమే సాగుతోంది. ఎవరూ తగ్గేటట్లు లేరు. నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేసాయి. ఈ దాడిలో ఏమరుపాటున ఆ అణుకేంద్రం నుంచి వెలువడే అణుధార్మికత ప్రమాదకరమే. ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అమెరికా అధినేత ట్రంప్ ప్రయత్నిస్తున్న తరుణంలో చైనా ఇరాన్‌తో చేయికల్పడం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోనని సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రష్యా కూడా రంగంలోకి దిగితే ఇక అది ప్రపంచ యుద్దానికి దారితీయవచ్చు. మరోవైపు ఉక్రెయిన్ కూడా ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికాతో చేతులు కలిపింది. ఇది సహజంగానే రష్యాకు గిట్టదు. మొత్తంగా ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా ఏర్పడితే వినాశనం తప్పదు. ప్రజలు ఆకలిచావులకు లోను కావాల్సిందే. ఈ క్రమంలో యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నాలు సాగాలి. ఇరు దేశాల మధ్య ఇగోలను చల్లార్చాలి. ఈ దశలో ఎవరు ముందుకు వస్తారన్నదే ముఖ్యం.

## పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి

**200 మంది వరకు చనిపోయినట్లు యూనిసెఫ్ ప్రకటన**

**న్యూఢిల్లీ,మార్చి6 :** అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. యుద్ధం కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మొదలైన నాటినుంచి దాదాపు 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తాజాగా యునిసెఫ్ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది మరణించినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో (7), ఇజ్రాయెల్ (3), కువైట్(1)లో మృతి చెందినట్లు తెలిపింది. యుద్ధాలు పిల్లలు ప్రారంభించరు.. కానీ, మూల్యం మాత్రం చెల్లిస్తున్నారు అని వ్యాఖ్యానించింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇదిలాఉండగా.. అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు ఆపరేషన్‌లో ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న ఓ బాలికల పాఠశాలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 160 మందికి పైగా విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది. ఈ దాడిపై తాజాగా యూఎస్ దళాలు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూఎస్ అధికారులు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విజయనగరం,మార్చి6 : 26వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున మరుపల్లి గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. గజపతినగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదమానాపురం గ్రామానికి చెందిన రౌతు ధనుంజయ నాయుడు (23) పెదనాన్న కుమార్తె వివాహం శుక్రవారం విజయనగరంలో జరగనుంది. ఏర్పాట్లను పరిశీలించడానికి ధనుంజయ నాయుడు మరో ముగ్గురు యువకులతో కలిసి యజమానాపురం నుంచి విజయనగరం వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో మరుపల్లి గ్రామం వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ధనుంజయనాయుడు అక్కడిక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులన గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం విజయనగరం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తిరుమలలో బర్త్‌డే సెలబ్రేషన్స్

**దివ్వెల మాధురి,తనూజలపై చర్యకు టిటిడి ఆదేశం**

తిరుమల,మార్చి6(ఆర్ఎన్ఎ): తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్న దివ్వెల మాధురి, బిగ్ బాస్ ఫేమ్ తనూజ పుట్టస్వామిలపై చర్యలకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధమైంది. ఈ వ్యవహారంపై విజిలెన్స్ పోలీసులకు టీటీడీ ఫిర్యాదు చేసింది. తిరుమలలో ఈ తరహా వేడుకలు పూర్తిగా నిషేధమని టీటీడీ ఈ సందర్భంగా పేర్కొంది. ఈ పుట్టిన రోజు వేడుకలను చిత్రీకరించి.. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై అభ్యంతరం తెలిపింది. టీటీడీ ఇచ్చిన ఫిర్యాదుపై విజిలెన్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తిరుమలకు కేక్ తీసుకు వచ్చి.. కట్ చేయడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని విజిలెన్స్‌కు ఇచ్చిన ఫిర్యాదులో టీటీడీ స్పష్టం చేసింది. గతంలోనూ తిరుమలలో దివ్వెల మాధురి, దువ్వాడ శ్రీనివాస్ రీల్స్ చేశారు. దీనిపై విజిలెన్స్ పోలీసులకు టీటీడీ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తిరుమలలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఆ సమయంలో టీటీడీ హెచ్చరించింది. ఆ తర్వాత పలువురు ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే.. వారిపై టీటీడీ చర్యలు కూడా తీసుకున్న విషయం విదితమే. ఇటీవల యూట్యూబర్ గీతూ రాయల్ సైతం తిరుమలలో రీల్స్ చేశారు. దీనిపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా దివ్వెల మాధురి, తనూజ పుట్టస్వామి జన్మదిన వేడుకలపైనా భక్తులు మండిపడుతున్నారు.

## గల్ఫ్‌కు వెళ్లే 12 విమానాలు రద్దు

హైదరాబాద్,మార్చి6 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో విమానాల రద్దు కొనసాగుతోంది. శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన 12 విమానాలు రద్దయ్యాయి. అదే సమయంలో గల్ఫ్ దేశాల నుంచి శంషాబాద్‌కు రావాల్సిన మరో 12 విమానాలు కూడా రద్దయ్యాయి. ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా నుంచి రావాల్సిన, వెళ్లాల్సిన విమానాలు రద్దు అయినట్లు అధికారులు తెలిపారు.

# యుద్ధం నుంచి వెనక్కి తగ్గబోం

**అసలు యుద్ధం మొదలయ్యిందే ఇప్పుడు**

**అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం**

వాషింగ్టన్,మార్చి6 : ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం నుంచి వెనక్కి తగ్గేదే లేదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ స్పష్టం చేశారు. అమెరికా సైనిక శక్తిని ఇరాన్ తక్కువ అంచనా వేస్తోందన్నారు. ఈ యుద్ధంలో అమెరికా నిలబడలేదని ఇరాన్ అనుకుంటోందని, తాము అసలు పోరాటాన్ని ఇప్పుడే మొదలుపెట్టామని ఆయన పేర్కొన్నారు. ఇక గల్ఫ్ ప్రాంత సముద్ర జలాల్లో అమెరికా నౌకా దళాలు వెనక్కి జరుగుతున్నాయనే ప్రచారాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఖండించింది. యావత్ ఇరాన్ నేవీని సముద్రంలో ముంచేసే వరకు తమ మిషన్ ఆగదని తేల్చి చెప్పింది. గత 72 గంటల్లో ఇరాన్‌లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్ ఫోర్స్ వైమానిక దాడులు చేసిందని సెంట్‌కామ్ వెల్లడించింది. బి-2 స్పిరిట్ బాంబర్ విమానాల నుంచి కేవలం ఒక గంట వ్యవధిలోనే 2వేల పౌండ్ల బరువున్న డజన్ల కొద్దీ పెనెట్రేటర్ బాంబులను బాలిస్టిక్ మిస్సైల్ లాంచ్ ప్యాడ్లపై వేశామని పేర్కొంది. అమెరికా సంకల్పం ఎంత బలమైందో ఇరాన్ అర్థం చేసుకోలేకపోతోందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెథ్ అన్నారు. ఇరాన్‌పై తమ సైనిక చర్యను బలంగా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. వాషింగ్టన్‌లో విలేకరుల సమావేశం వేదికగా పీట్ హెగ్సెథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాను ఇరాన్ నేతలు, ఐఆర్‌జీసీ తక్కువ అంచనా వేస్తున్నాయని ఆయన చెప్పారు. తమ సంకల్పానికి కట్టుబడి ఉంటామని, ఇరాన్‌పై పోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. పూర్తి శక్తితో అమెరికా ఇప్పుడే దాడులను మొదలుపెట్టిందన్నారు. ఒకవేళ అవసరమైతే దీర్ఘకాలం పాటు ఈ యుద్ధాన్ని చేసేందుకూ అమెరికా సన్నద్ధమై ఉందని పేర్కొన్నారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో అరబ్ దేశాల నుంచి అమెరికాకు శరణార్థులు క్యూ కట్టే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే అరబ్ శరణార్థులకు అమెరికాలో ఆశ్రయాన్ని కల్పించే ఎలాంటి ప్రణాళికలూ ప్రస్తుతానికి తమకు లేవని అమెరికా రక్షణ మంత్రి తేల్చి చెప్పారు.

# ఎనుమాముల మార్కెట్లో మిర్చి రాసులు

**భారీగా తరలి వచ్చిన బస్తాలు**

వరంగల్,మార్చి6 : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు భారీగా మిర్చి రావడంతో మార్కెట్ ఎరుపెక్కింది. వరుసగా రెండ్రోజుల నుంచి సుమారు 35 నుంచి 40వేల బస్తాల మిర్చి అమ్మకానికి వచ్చింది. ఈ సీజన్‌లో ఇదే అధికం. దీంతో యార్డులో ఎటు చూసినా మిర్చి బస్తాలే దర్శన మిచ్చాయి. మిర్చి ధరలు గత సంవత్సరంతో పోలిస్తే మెరుగ్గా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మార్కెట్‌లో మంచి నాణ్యత ఉన్న మిర్చికి గరిష్టంగా పలికిన ధరలు ఇలా ఉన్నాయి... తేజ రకం మిర్చి క్వింటాకు రూ.18,800, వండర్‌హాట్ రూ. 35వేలు, యూఎస్.341 రూ.21వేలు, దీపిక రూ. 30వేలు, ఎల్లోమిర్చి రూ.20 వేలు, సింగిల్‌పట్టి రూ.40వేలు, దేశీ మిర్చి రూ.40వేలు, తాలు క్వింటాకు రూ. 12వేలు పలికింది. ఇటీవల చపాట మిర్చి ధరలు బాగా పెరిగాయి. నాలుగు సంవత్సరాల తరువాత దేశీ మిర్చి ధరలు పుంజుకుంటున్నాయి. 2021-22లో మిర్చి ధరలు, ముఖ్యంగా దేశీ మిర్చి ధర క్వింటాకు లక్ష రూపాయల వరకు పలికింది. ఆ తరువాత గడిచిన నాలుగేళ్లుగా రూ.30వేల నుంచి రూ.40వేలు.. తేజ, వండర్‌హాట్, యూఎస్ 341 లాంటి రకాలకు రూ.12వేల నుంచి రూ.16వేలు పలికాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అనేక మంది రైతులు మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో కొంత కాలంగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. జియోట్యాగింగ్ కలిగిన దేశీ మిర్చికి విదేశాలలో మంచి డిమాండ్ ఉండడంతో ఎగుమతులు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. కాగా, వరంగల్ వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం మిర్చి ధరలు గరిష్టంగా ఉన్నాయి. గత నెల మొదటి వారంలో మిర్చి సీజన్ ప్రారంభం కాగా, తొలుత క్వింటాకు రూ.16,300 నుంచి రూ.16,800 వరకే సగటు ధరలు ఉన్నాయి. మార్కెట్‌కు వరుస సెలవుల అనంతరం ఈనెల 18న సగటు ధర రూ.17,011ఉండగా క్రమంగా పెరుగుతూ తాజాగా రూ.18,489కి చేరింది. ఖమ్మం, వరంగల్ మార్కెట్ల రాబడులు, కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న నిల్వలు, ఇతర దేశాల ఎగుమతుల అంశాలన్నీ ఇక్కడి మిర్చి ధరలను ప్రభావితం చేస్తున్నట్లు వ్యాపారులు విశ్లేషిస్తున్నారు.

# ప్రజలను ఏమార్చే పాలన

- **రెండేళ్లుగా అదే చేస్తున్నారు**
- **మరోమారు ప్రజలను మోసం చేసే యత్నం**
- **గతంలో ఇచ్చిన దరఖాస్తులకే దిక్కులేదు**
- **99 రోజుల ప్రజాపాలనపై మండిపడ్డ హరీష్ రావు**

హైదరాబాద్,మార్చి6 : గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి తీసుకున్న లక్షలాది దరఖాస్తులు పరిష్కారం కాక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దరఖాస్తులకు దిక్కు లేదు కానీ, మళ్లీ ఇప్పుడు పది వారాల పాటు పది రకాల నాటకాలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గు చేటని అన్నారు. రెండున్నరేండ్లలో అసలు ఏం చేసారని ప్రచారం నిర్వహిస్తున్నారు. రేవంత్ రెడ్డి గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి మీ పైఫల్యాలు ప్రచారం చెప్పుకుంటారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాక్షన్ ప్లాన్ పేరిట పాలనా వైఫల్యం నుంచి దృష్టి మరల్చేందుకు డైవర్షన్ ప్లాన్ డ్రామాకు తెర తీశారని ధ్వజమెత్తారు. ప్రచార కోసమేనని, ప్రజలకు ఒరిగేదేమి లేదని అన్నారు. 800 రోజుల పాలనలో చేసిందేం లేక, 99 రోజు ప్రణాళిక పేరిట రేవంత్ రెడ్డి మరో డ్రామాకు తెరతీసిందని ఆరోపించారు.రెండున్నరేండ్ల పాలన తర్వాత ప్రగతి ప్రణాళికలు గుర్తుకు వచ్చాయా?అంటూ నిలదీశారు.అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలన వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాంలు, ప్రజల ఛీత్కారాల నుంచి దృష్టి మరల్చేందుకు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మరో డైవర్షన్ ఎ÷-లాన్ అని విమర్శించారు. కోతల సమయం వచ్చినా ఈ సీజన్ ఇప్పటి వరకు రైతు భరోసా దిక్కు లేదు.గత సీజన్ పంట బోనస్ ఇవ్వక చేతులెత్తేసారు. చివరకు యూరియా కూడా సరఫరా చేయలేక రైతులను నడిరోడ్డు మీదకు ఈడ్చారు.నమ్మించి గొంతు కోసిన ఈ మోసాల గురించి రైతులకు వివరిస్తారా? చెప్పాలని డిమాండ్ చేశారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు అని ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చాక యువతను మోసం చేశారు. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేశారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా మూసీ బ్యుటిఫికేషన్ పేరిట లూటీకి తెగబడ్డారు. రాజీవ్ యువ వికాసం పేరిట తీసుకున్న దరఖాస్తులు దిక్కు లేకుండా పోయాయని హరీష్‌రావు విమర్శించారు. యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం అంటూ కొత్త పాట పాడుతున్నారని దుయ్యబట్టారు .అందని గ్యారెంటీల కోసం ఎదురుచూస్తున్న లక్షల మంది బాధితుల సంగతేంటో చెప్పాలని,సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ అడ్డుకట్ట లాంటివన్నీ పత్రికల్లో పబ్లిసిటీ ఇచ్చుకునేందుకు పెట్టుకున్న పేర్లు తప్ప, ఇందులో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.పాలన గాలికి వదిలి పబ్లిసిటీ పేరిట చేస్తున్న మీ గారడీలను ప్రజలు గమనిస్తున్నారని, దుర్మార్గ పాలనను నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు



# పల్లె పండగలో గ్రామీణ రోడ్లకు మహర్దశ

**మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి**

అమరావతి,మార్చి6 ):ఉపాధి హామీ పథకం కింద పల్లెపండుగ రూపంలో గ్రామీణ రోడ్ల నిర్మాణం చేపట్టామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, ఇంకుడు గుంతలు, మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రశ్నకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మంత్రి పవన్ కళ్యాణ్‌కు బదులు మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం ఇచ్చారు. 2025-26 కోసం బడ్జెట్‌లో రూ.4350కోట్లు విడుదల అయ్యాయని తెలిపారు. 2022 నుంచి ఇప్పటి వరకూ చేపట్టిన పనులకు సాస్కి కింద రూ.1342కోట్లు వచ్చాయని మంత్రి వివరించారు. ప్లలెపండుగ 1 కింద 4 వేల కిలోమీటర్ల మేర వివిధ రోడ్లు వేశామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు1594 కిలోమీటర్ల రహదారులు వేసినట్లు చెప్పారు.శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో పల్లెపండుగ 2.0 అమలుపై



ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రశ్న అడిగారు. పల్లెపండుగ కార్యక్రమంలో వేలాది కిలోమీటర్లు రోడ్లు వేశారని.. దీనివల్ల ఎమ్మెల్యేలంతా గౌరవంగా గ్రామాల్లోకి వెళ్లగలుగుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ నిబంధనలను కేంద్రం మార్చిందని.. దీంతో రాష్ట్ర వాటా 10శాతం నుంచి 40శాతానికి పెరిగిందని చెప్పారు. ఆ మేరకు బ్జడెట్‌లో రాష్ట్ర కేటాయింపులు పెంచాలని ఎమ్మెల్యే కోరారు. వైసీపీ హయాంలో జలజీవన్ మిషన్ పథకం సద్వినియోగం చేయలేదని.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉంటుందని.. గతంలో డ్రైనేజీలకు నిధులు ఇవ్వలేదని... ఈసారైనా నిధులివ్వాలన్నారు. పనిదినాలను125 రోజులకు పెంచారని.. దీని వల్ల రాష్ట్రానికి 5 కోట్ల పనిదినాలు పెరిగాయని తెలిపారు. పనులకు సంబంధించి కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని... వాటిని మంజూరు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో 21.30 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్లు వేశామని నాదెండ్ల అన్నారు. డ్రైనేజీ వ్యవస్థలో ఇదో విప్లవమని... చాలాచోట్ల ఈ డిమాండ్ ఉందని చెప్పారు. గత వైసీపీ హయాంలో రూ.13,300 కోట్ల మేర జలజీవన్ మిషన్ నిధులు నిలిచిపోయాయని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో నిబంధనలు మార్చారని.. దీనిపై పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రాలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

----

# ఇరాన్ యుద్ధంతో భారత్ ఎగుమతులకు అంతరాయం

**ఇరాన్‌కు నిలిచి పోయిన బాస్మతి బియ్యం**

న్యూఢిల్లీ,మార్చి6(ఆర్ఎన్ఎ): ఇరాన్ యుద్ధం ప్రభావం ప్రపంచంపై తీవ్రంగా పడుతోంది. ముఖ్యంగా ఇండియాపై దీని ప్రభావాన్ని కాదనలేం. చమురు విషయంలో దేశానికి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు. కానీ, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు మాత్రం నిలిచిపోయాయి. ముఖ్యంగా ఇండియాలో పండే బాస్మతి బియ్యం ఎగుమతి ఆగిపోయింది. రవాణా జరిగే హోర్ముజ్



జలసంధిపై ఆంక్షలు, పలు నౌకలు నిలిచిపోవడం వల్ల బాస్మతి బియ్యాన్ని ఎగుమతి చేయడం లేదు. వ్యాపారవర్గాల తాజా అంచనా ప్రకారం మొత్తం 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. ఇందులో కొంత మార్గ మధ్యలో నౌకల్లో నిలిచిపోగా, ఇంకొంత పోర్టుల్లో, గోడౌన్లలో నిలిచిపోయింది. దీంతో వ్యాపారులు, రైతులు, మిల్లర్లు ఇబ్బందులు పడుతున్నారు. బాస్మతి బియ్యం ఎగుమతుల్లో ఇండియాది అగ్రస్థానం. అందులోనూ మనం పండించే బాస్మతి బియ్యం ఎక్కువగా ఇరాన్ సహా సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ వంటి గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశాలకే వెళ్తుంది. మన దేశంలోని 50 శాతం ఎగుమతులు ఈ దేశాలకు ఎగుమతి అవుతాయి. అలాంటిది ఇప్పుడు ఈ దేశాలు యుద్ధ సంక్షోభంలో చిక్కుకోవడంతో ఎగుమతులపై ప్రభావం పడుతోంది. అంతర్జాతీయంగా రవాణా నిలిచిపోవడంతో దేశీయంగా బాస్మతి ధరలు తగ్గుతున్నాయి. క్వింటాల్‌కు సగటున రూ.1,000 వరకు ఇండియాలో ధరలు తగ్గుతున్నట్లు వ్యాపారవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌పై ఈ ప్రభావం ఎక్కువగా ఉందని అంటున్నారు. మన దేశం నుంచి రవాణా అయ్యే ఇతర ఉత్పత్తులపై కూడా ఇదే తరహా ప్రభావం ఉంది. మధ్యప్రదేశ్‌లోని అరుదైన బర్వాని రకం అరటి ఎగుమతులు కూడా ఆగిపోయాయి. ఈ సంక్షోభం నివారణ అయితే, తిరిగి వ్యాపారం పుంజుకుంటుందని రైతులు, వ్యాపారులు ఆశిస్తున్నారు.

# జిల్లాకు ప్రతిష్టాత్మకం కోర్టు భవన నిర్మాణం

- నేడు(శనివారం) శంకుస్థాపన కార్యక్రమం
- అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మార్చి 6 ,( చట్టం బ్యూరో ) :** నూతనంగా నిర్మించ తలపెట్టిన కోర్టు భవనాల సముదాయం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి మరో ఆకర్షణగా నిలవనుంది. మరో 50 సంవత్సరాల అవసరాలు తీర్చేలా అత్యాధునిక వసతులతో నిర్మించ తలపెట్టిన భవన నిర్మాణానికి శనివారం ఉదయం శంకుస్థాపన జరగనుంది. పాత కోర్టు స్థానంలోనే సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.81 కోట్ల 60 లక్షల వ్యయంతో రూపుదిద్దుకోనున్న భవనంలో 12 రకాల న్యాయస్థానాలు కొలువుదీరేలా తీర్చిదిద్దనున్నారు. ఒక్కో అంతస్తు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం జరగనుంది. విశాలమైన కోర్టు హాళ్లు, ప్రతి అంతస్తులు ప్రత్యేకంగా వాష్ రూమ్ లు కక్షిదారులకు వెయిటింగ్ హాళ్లు కనీసం 300 కార్లకు పార్కింగ్ సౌకర్యం కల్పిస్తూ నూతన భవనం నిర్మించబోతున్నారు. సెల్లార్తోపాటు టెన్ ప్లస్ టు నిర్మాణ శైలితో రాబోయే రెండేళ్లలో పూర్తిస్థాయిలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

**ప్రతిష్టాత్మకంగా శంకుస్థాపన కార్యక్రమం**

న్యాయస్థాన భవన సముదాయానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేకంగా కోర్టు ప్రాంగణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి పి నీరజ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ వర్చువల్ విధానాల్లో శంకుస్థాపనలో పాల్గొంటున్నారని వెల్లడించారు. వీరితోపాటు హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ, జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు, జస్టిస్ ఇవి వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లోని న్యాయవాదులు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సమావేశంలో న్యాయమూర్తులు శ్రీమతి బి పుష్పలత, శ్రీమతి రాధిక జైస్వాల్, శ్రీ పి లక్ష్మణ చారి, శ్రీ ఏ ప్రవీణ్ కుమార్, న్యాయవాదుల సంఘం సిరిసిల్ల వేములవాడ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, సదానందం సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# రుక్మాపుర్--కాట్నపల్లి గ్రామాల్లో NSS ప్రత్యేక శిబిరం ప్రారంభం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా/ మార్చి 6,( చట్టం బ్యూరో) :** కరీంనగర్‌లోని ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో రుక్మాపుర్ మరియు కాట్నపల్లి గ్రామాలలో చీూా ప్రత్యేక శిబిరం ఘనంగా ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కలువకుంట సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు సామాజిక బాధ్యతను అర్థం చేసుకొని ప్రజాపాలనలో భాగస్వాములు కావాలని సూచించారు. ఇటువంటి శిబిరాలు విద్యార్థులకు ప్రజల జీవితాన్ని దగ్గరగా తెలుసుకునే మంచి అవకాశం కల్పిస్తాయని అన్నారు.

రుక్మాపుర్ సర్పంచ్ హేమలత మాట్లాడుతూ వాలంటీర్లు గ్రామ సమస్యలను అర్థం చేసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. చిన్న వయసులోనే నైతిక విలువలను అలవర్చుకుంటే భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు.

కాట్నపల్లి సర్పంచ్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలో చీూా వాలంటీర్లుగా చేరడం గొప్ప అదృష్టమని, ఈ దశలో క్రమశిక్షణతో కష్టపడితే భవిష్యత్తు సాఫల్యంగా మారుతుందని అన్నారు.

కళాశాల చీూా గౌరవాధ్యక్షుడు, జిసి జిటిఏ రాష్ట్ర కార్యదర్శి కళారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ శిబిరాలు విద్యార్థుల్లో స్నేహభావం, పరస్పర సహకారం పెంపొందిస్తాయని తెలిపారు. జిల్లా చీూా నోడల్ ఆఫీసర్ డాక్టర్ కాంపల్లి అర్జున్ వాలంటీర్లు సామాజిక సేవా దృక్పథంతో పనిచేసి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆశ్రమ అధ్యక్షులు మూర్తి విద్యార్థులు నైతిక విలువలతో జీవితం నిర్మించుకోవాలని సూచించారు.

చీూా యూనిట్--2 ప్రోగ్రాం ఆఫీసర్ రాజేందర్ మాట్లాడుతూ శిబిరం ద్వారా గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, పరిశుభ్రత, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సమాజానికి ఉపయోగపడే విధంగా సేవలు అందిస్తామని తెలిపారు. చీూా యూనిట్--5 ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాలంటీర్లు సేవా భావంతో గ్రామ ప్రజలతో కలిసిమెలిసి పనిచేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు.




# మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి






**మహబూబాబాద్ జిల్లా మరిపెడ, మార్చి 6, చట్టం న్యూస్, :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ గా మరిపెడ మున్సిపాలిటీ ఆఫీస్ లో వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టారు, ఈ కార్యక్రమం నికి ముఖ్య అతిథి గా డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ పాల్గొన్నారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల పాలనకు అండగా ఉండండి. అభివృద్ధికి సహకరించండి.

బాధ్యతల స్వీకార కార్యక్రమానికి విచ్చేసిన కౌన్సిలర్లకు, అధికారులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు.మరిపెడ పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు 15వ ఫైనాన్స్ నిధులు ద్వారా నిధులు విడుదలచేస్తూ,మరిపెడ పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తాను.పట్టణంలోని 15 వార్డుల్లో ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం.ముఖ్యంగా పట్టణంలో శానిటేషన్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తాము అన్నారు,మున్సిపాలిటీలో కలిసినప్పటికీ శివారు ప్రాంతాలు ఇంకా గ్రామాలుగానే ఉన్నాయి. వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి అక్కడ నెలకొన్న సమస్యలు త్వరితగతిన ఈ కార్యక్రమంలో విజయానంద్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్,మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘువీరారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, వంటికొమ్ము యుగంధర్ రెడ్డి,సర్పంచ్ పెండ్లి శ్రీనివాస్ రెడ్డి, గంధసిరి అంబరీష,కాలం రవీందర్ రెడ్డి,నల్లు శ్రీకాంత్ రెడ్డి,గంధసిరి బిక్షపతి గౌడ్, అల్వాల ఉపేందర్ ప్రజాపతి, మహేష్ ,గంధసిరి వేణు, గూగులోతు రవి నాయక్,కాలం శ్రీనివాస్ రెడ్డి,టేకుల యాదగిరి రెడ్డి,కెసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెదబోయిన అయిలమల్లు, అఫ్జల్,కుడితి నరసింహారెడ్డి,రేసు సత్తి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేద కుటుంబాలకు అండగా ప్రజా ప్రభుత్వం

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కి**

**ధన్యవాదాలు తెలిపిన వెదిరె స్వప్న -- పర్శరాం ;**



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మార్చి 6,( చట్టం బ్యూరో ) :** విలాసాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా నిర్మించిన ఇంటికి నూతన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు,నిరుపేదలకు సొంత ఇల్లు కలను నిజం చేస్తూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా గ్రామానికి చెందిన వేదిర స్వప్న--పర్శరాం కుటుంబం తమ సొంత ఇంటి కలను సాకారం చేసుకున్నారు,ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ--రాజు గార్ల ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు,ఈ సందర్భంగా జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం గారి కృషిని కుటుంబ సభ్యులు స్మరించుకుని హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు,తమకు సొంత ఇల్లు కలగడానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గారు చేసిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు ఏనుగుల ప్రశాంత్ కుమార్,మార్కెట్ డైరెక్టర్ కళ్లేపల్లి సతీష్,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం కనకయ్య,జూలపల్లి సంపత్ రావు,వార్డు సభ్యులు దమ్మ వెంకటరమణ,పోలె శేఖర్,జోగు శంకర్,గోల్కొండ సురేష్,సుంకపాక అనిల్,గ్రామ కార్యదర్శి మిరుదొడ్డి శ్రీనివాస్,గోల్కొండ శ్యామ్ బాబు,దమ్మ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

--------

# జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాలన- ప్రగతి ప్రగతి99రోజులు కార్యక్రమం

**అందోల్ మండల్ ప్రతినిధి మార్చి 6 (చట్టం)న్యూస్ :** సంగారెడ్డి జిల్లా అంతర్జావర్గంలో జోగిపేట పట్టణంలో స్థానిక నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జోగిపేట యందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. పి. రమేష్ అధ్యక్షతన,ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక-99 రోజులలో భాగంగా ఈరోజు కళాశాలలో ప్రాంగణ స్వచ్ఛత ప్రాంగణ శుభ్రం చేయడం జరిగింది. అదేవిధంగా కళాశాలలోని ఉపయోగపడని వస్తువులను స్టోర్ రూమ్ కి బదిలీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాలలోని విద్యార్థిని విద్యార్థులు మరియు యన్ యస్ యస్ - యూనిట్-1 మరియు 2 వాలంటీర్స్ , అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.




# టీమిండియా అద్భుత ప్రదర్శన

## ఎక్స్ వేదికగా చంద్రబాబు, లోకేశ్ అభినందనలు



**అమరావతి,మార్చి6 :** టీ20 ప్రపంచకప్ సెమీ ఫైనల్లో గెలుపొంది తుది పోరుకు అర్హత సాధించిన భారత జట్టుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. ఇంగ్లండ్‌పై టీమ్ఇండియా అద్భుత విజయం సాధించిందని 'ఎక్స్' వేదికగా కొనియాడారు. న్యూజిలాండ్‌తో ఈ నెల 8న జరిగ్గే ÷నైల్ మ్యాచ్‌లో కూడా ఇదే జోరు కొనసాగించి మరోసారి ప్రపంచ కప్‌ను ముద్దాడాలని ఆయన ఆకాంక్షించారు. 'ఎంతో అద్భుతమైన మ్యాచ్! ఇంగ్లండ్‌పై అద్భుతమైన విజయం సాధించి ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ ÷నైల్‌కు చేరిన టీమ్ఇండియాకు అభినందనలు. సంజూ శామ్సన్, శివమ్ దూబెల మెరుపు ఇన్నింగ్స్, జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యాల చక్కటి బౌలింగ్, అక్షర్ పటేల్ చురుకైన ఫీల్డింగ్‌తో మంచి ప్రదర్శన చేశారు. ఉత్కంఠ పోరులో సమష్టి పోరాటంతో భారత జట్టు గొప్ప విజయం సాధించి తుదిపోరుకు చేరింది. ఫైనల్లోనూ ఇదే ఆటతీరును ప్రదర్శించాలని కోరుతున్నా' అని చంద్రబాబు అన్నారు. టీమ్ఇండియా సమష్టి ప్రదర్శనను మెచ్చి ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కూడా అభినందనలు తెలిపారు. 'సెమీస్‌లో భారత్ అద్భుత ప్రదర్శన కనబర్చింది. సంజూ శామ్సన్, శివం దూబె చక్కటి ఆటతీరుతో టీ20 ప్రపంచకప్ సెమ్గి÷నైల్లో ఇంగ్లండ్‌పై చిరస్మరణీయ విజయం సాధించాం. ఈ ఆధిపత్య ప్రదర్శనకు జట్టులోని సభ్యులందరికీ అభినందనలు. దేశం మిమ్మల్ని ప్రోత్సహిస్తోంది. ÷నైల్లోనూ మరింత మెరుగైన ప్రదర్శనతో దేశానికి కప్ తీసుకురావాలి' అని లోకేశ్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. కాగా.. ఇంగ్లండ్‌పై గెలిచిన టీమ్ఇండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. టీ20 క్రికెట్లో ఇప్పటివరకూ ఏ జట్టుకూ సాధ్యం కాని ఘనతను సొంతం చేసుకుంది భారత్. పురుషుల పొట్టి ప్రపంచకప్ ఫార్మాట్లో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. పొట్టి క్రికెట్లో అత్యధిక సార్లు 250 ప్లస్ స్కోరు సాధించిన జట్టుగా నిలిచింది. తద్వారా ఐపీఎల్ ఫ్రాంఛైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ పేరిట ఉన్న రికార్డును బద్దలుకొట్టింది. కాగా.. సూపర్-8లో జింబాబ్వేపై 256 పరుగులు సాధించిన భారత జట్టు.. సెమీస్‌లోనూ 250కి పైగా స్కోరు నమోదు చేసింది. ఈ విజయంతో భారత అభిమానుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రపంచ క్రికెట్‌లో భారత్ తన బలాన్ని మరోసారి నిరూపించిందని క్రీడాభిమానులు అంటున్నారు.

# 'నిజాయితీలో మా పిల్లలు బంగారం'

## విద్యార్థినులను అభినందించిన నారా లోకేశ్

**అమరావతి,మార్చి6 :** తిరుపతి జిల్లాలోని వెంకటగిరి జెడ్పీ హైస్కూల్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినుల నిజాయితీని మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. చిన్న వయస్సులోనే విద్యార్థినిల నీతివంతమైన ప్రవర్తన ఆదర్శనీయమని ప్రశంసించారు. విద్యార్థినిల నిజాయితీ విద్యాశాఖ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసిందన్నారు. 'నిజాయితీలో మా పిల్లలు బంగారం' అని మంత్రి లోకేశ్ అన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరి జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థినిలు తమ నిజాయితీతో ఆదర్శంగా నిలిచారు. నిన్న(గురువారం) సాయంత్రం స్కూలు ముగిసిన తర్వాత వెంకటగిరి ఎస్‌బీఐ బ్యాంకు వద్ద మన్నవరం బస్సు కోసం ఎదురుచూస్తున్న సమయంలో విద్యార్థినిలకు ఒక పర్సు కనిపించింది. ఆ పర్సులో బంగారు నగలు, నగదు ఉన్నాయి. ఎటువంటి ఆలోచన లేకుండా 8వ తరగతి విద్యార్థినిలు బి. గురుప్రియ, బి. గీతిక, ఎం. గీతిక, 6వ తరగతి చదువుతున్న పద్మశ్రీ, 7వ తరగతి విద్యార్థిని హేమలతలు వెంటనే పర్స్‌ను తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ స్వరూపకు అందజేశారు. పోలీసుల నుంచి అభినందనలు అందుకున్న తర్వాత విద్యార్థినిలు బస్ స్టాప్ వద్దకు వచ్చారు. అక్కడ ఓ మహిళ ఆ పర్సు వెతుకుతూ పిల్లలను అడిగింది. విద్యార్థినిలు తమకే దొరికిందని.. పోలీస్ స్టేషన్‌లో ఇచ్చేశామని చెప్పి ఆమెతో పాటు మళ్లీ స్టేషన్‌కు వెళ్లారు. ఎస్ఐ ఆ మహిళ వివరాలు తెలుసుకుని... పర్సులోని నగలు, నగదు ఆమెవేనని నిర్ధారించుకుని అందజేశారు. ఈ సంఘటనపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. 'నిజాయితీలో మా పిల్లలు బంగారం' అని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నిజాయితీ, నైతిక విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని పేర్కొన్నారు. 'చిన్న వయసులోనే మీ నీతివంతమైన ప్రవర్తన ఆదర్శంగా నిలిచింది చె÷-లలెమ్మలూ. మీకు ఎల్లప్పుడూ అండగా ఉండే అన్నగా నేను గర్విస్తున్నాను. మీ నిజాయితీ మన విద్యాశాఖ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసింది. హృదయపూర్వక అభినందనలు చిట్టితల్లులూ' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# శివకళ్యాణంకు పోటెత్తిన భక్తులు

## ప్రయాణికుల ఇబ్బందులు



**కొడిమ్యాల, మార్చి 6(చట్టం) :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో శివకళ్యాణం వేడుకలు ఆలయ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో పాల్గొనడానికి సమీప జిల్లాలతో పాటు దూర ప్రాంత జిల్లాల భక్తులు సైతం రావడం ఆనవాయితీ. సమీప జగిత్యాల జిల్లా కేంద్రానికి వేములవాడ నుండి వయా కొడిమ్యాల, పూడుర్ మీదుగా రోజువారీ బస్సులతో పాటు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని డిపో అధికారులు తెలిపారు. ప్రయాణికుల తాకిడీకి అనుగుణంగా బస్సులు సరిపోకపోవడతో ఒక్కో బస్సులో రెండు బస్సుల మంది ప్రయాణికులు ప్రయాణించడం జరిగింది. ఫలితంగా ప్రయాణికులు అటు కండక్టర్లు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / మార్చి 6,( చట్టం బ్యూరో ) :** పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మకల్ గ్రామానికి చెందిన గాలి పల్లి నరేందర్ అనునతడు మానేరు వాగు నుండి అక్రమంగా ఇసుకను దొంగలించి తన ట్రాక్టర్లో తరలిస్తుండగా బొమ్మకల్ లోని లారీ అసోసియేషన్ చౌరస్తా వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు ఆ ట్రాక్టర్ ను సీజ్ చేసి నిందితుడి పై కేసు నమోదు చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సిఐ ఏ నిరంజన్ రెడ్డి తెలిపారు.



## చట్టం సాహితీ లోకం
95814 19999



### హోలీ -- ఆత్మల దివ్య కేళి!

పరమాత్మ పురుషుడు
అనంత విశ్వ ఆధ్యాత్మిక నాయకుడు
జీవాత్మలు అన్నీ స్త్రీలు
ఆయన చిత్తసంకల్పాల చెలులు
ప్రేమరంగుల పూదోటలో
పరిమళించే పరమానంద పుష్పాలు!

భక్తి అనే రంగుతో జీవులు
సద్గురుని సాంగత్యంలో చేరితే
దయ అనే పిచికారీతో ఆ పరమాత్మ
భక్తహృదయాలకు హోలీ చూపిస్తారు!
పై ఉన్నత లోకాల వైభవం
కేవలం చూపించడమే కాదు
ఆనందరసంలో ముంచి
ఆడించేది ఆయనే!

అది రంగుల క్రీడ కాదు
రసమయ తత్వస్పర్శ!
అది నీటిపిచికారీ కాదు
నిర్మలానంద ప్రవాహం!
జీవాత్మల హృదయాలు
పరమాత్మ మధుస్మితంలో లీనమై
"నేను" అనే రేఖ చెరిగిపోతూ
"నీవే" అనే రంగులో కలిసిపోతాయి!

అక్కడ లోకం లేదు, కాలం లేదు,
రంగుల మధ్య భేదం లేదు
ఒక్కటే పరమసత్యం
ప్రేమరూప హోలీ!
పరమాత్మ పురుషుడు
జీవాత్మలతో ఆడే
ఆ దివ్య రంగుల క్రీడే
నిత్య హోలీ!

E.V.V.S. వర ప్రసాద్
కవి, తెలుగు ఉపాధ్యాయుడు
తుని. (కాకినాడ జిల్లా)
కలం పేరు : వరశ్రీ



## చట్టం సాహితీ లోకం
95814 19999

### అంశం:-ఓ మగువా సరిలేరు నీ కెవ్వరు



ఆమె లేనిదే మనుగడయే లేదు
బాల్యంలో అమ్మకి అన్ని పనులలో సహాయం చేస్తు
కన్నతండ్రికి కనుపాపవై
అల్లారుముద్దుగా పెరిగిన నీవు ఇంటి దీపానివే

వివాహమై భర్తకు అన్నివేళలా తోడునీడగా
అతిథి అభ్యాగతుల సేవలో
పిల్లలకు నైతికవిలువలు నేర్చి
బరువు భాధ్యతలలో సగభాగమై
'క్షమాయ ధరిత్రి' కి మారుపేరుగా
అత్తమామల నాదరించే ఇంటి మహాలక్ష్మివి.

నేడు ఓ మగువా పురుషునితో బాటు
శాస్త్ర సాంకేతిక రంగాలలోనే గాక
దేశ రక్షణలోను
దేశ ప్రధాని, అధ్యక్ష పదవిలోను
విద్యా ,వైద్య రంగాలలోను
ఎన్నని చెప్పను ఏమని చెప్పను
సవ్యసాచివై పురుషునిలో సగభాగమై
అర్ధనారీశ్వరతత్వానికి ప్రతీకవైన
ఓ మగువా సరి లేరు నీకెవ్వరు....!!

కవిమిత్ర సాహిత్యరత్న
ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్
(పుష్యమి) హైదరాబాద్

## చట్టం సాహితీ లోకం
95814 19999

### రైతే రాజు



రైతు కష్టాన్ని కొలవాలంటే
ఎటువంటి కొలమానం లేదు
రైతు రాత్రింబవళ్ళు
కాయా కష్టం చేసి
పంటను పండిస్తాడు
పంటకు ధరను రైతు చెప్పడు
ఎవరో ధరను నిర్ణయిస్తారు
ఇది ఎంత వరకు సమంజసం?

దేశంలో ఎవరు తయారు చేసిన
వస్తువులకు వాళ్ళే ధర నిర్ణయిస్తారు
కానీ...రైతు పరిస్థితి అలా కాదు
పేరుకు మాత్రమే రైతే రాజు
రైతు ఇక్కడ ఒక పనిచేసేవాడుగా
అలా మిగిలిపోతున్నాడు
ఇందుకు కారణాలేంటి?
ప్రభుత్వాలు మారుతున్నా
రైతుల పరిస్థితి మారడం లేదు.

ఉద్యోగికి సెలవిచ్చినా
కంపెనీలకు తాళం పడినా
ప్రభుత్వాలే స్థంభించినా
అలా ఆగిన ప్రపంచాన్ని కూడా
తమ చేతులతో నడిపించేందుకు
పరుగెత్తేవాడే నిజమైన రైతు
అందుకే... అప్పుడూ...ఇప్పుడూ...
ఎప్పుడూ... ఇంకెప్పుడూ...
రైతే నిజమైన రాజుగా గుర్తించండి
రైతును అందరూ గౌరవించడం.

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385



## చట్టం సాహితీ లోకం
95814 19999

### శవాల శాపం...?



అది అగ్రరాజ్యపు అహంకారం...
పచ్చి నెత్తురు తాగే రాక్షస రూపం..!

దిక్కులు పిక్కటిల్లేలా
యుద్ధభేరిని మ్రోగిస్తూ
నేలతల్లి గుండెపై
రక్తపు ముద్రలు వేస్తూ
ఆకాశం నుండి విరుచుకుపడే
రాబందుల్లా క్షిపణులు కురిపిస్తూ
రాజ్యకాంక్ష చిచ్చులో
మానవత్వాన్ని ఆహుతి చేస్తున్న
ఓ క్రూర పాలకులారా..!

మీ అమ్ములపొదిలోని
అణుబాంబులు,
అత్యాధునిక ఆయుధాలు...
అమాయక ప్రజల ప్రాణాలను
హరించే మృత్యు పాశాలు..!

ఏ పాపమెరుగని
పసికందులను,
అమాయక జనులను
సజీవ సమాధి చేస్తూ,
శ్మశాన వాటికల
మీద సామ్రాజ్యాలు నిర్మిస్తారా..?

ఎందరో శ్రమకోర్చి
కట్టిన కట్టడాలు,
జీవనాధారమైన పరిశ్రమలు...
మీ క్షిపణుల దాడిలో నేలమట్టమై
ఇటుకల కుప్పలుగా మారుతుంటే...

గుట్టలుగా
పేరుకుపోయిన శవాల సాక్షిగా...
అజేయులమని వీర్రవీగుతున్నారా...
మీరు పూలు పూయని,
కాయలు కాయని
మోడువారిన విషవృక్షాలు..!

ప్రజలులేని శూన్య జగత్తును
ఏలాలనుకోవడం మీ మూర్ఖత్వం కాదా..?

గుర్తుంచుకోండి...
రేపు మీరు చక్రవర్తులు కావచ్చు
అది కేవలం స్మశానాలకే...
రేపు మీరు తాగేది నీరు కాదు
ఎడారిలో ఎండమావిలాంటి చమురు...
రేపు మీరు తినేది తిండి కాదు
యుద్ధం మిగిల్చిన ఇసుక రేణువులే..!

నీటి బుడగవంటి నరుని బ్రతుకును
నిత్యం మృత్యువు వెంటాడుతూ
మంచుకొండల చాటున
మీ అంతఃపురాల గడపల వద్ద
కాపు కాసి ఉంటుంది జాగ్రత్త..!

మీరు కూడబెట్టిన సంపద
బూడిదయ్యే రోజు వస్తుంది...
దిక్కులేని చావు
మీ దరికి చేరుతుందని
ఈ శవాలు శపిస్తున్నాయి...

ఇది ఆ మృత్యువు
రాతిపై చెక్కిన శిలాశాసనం.
పరలోకపు కోర్టులో మీరు చేసిన
మారణకాండకు తిరుగులేని తీర్పుతో...

మీ తలపై ముళ్ళ కిరీటం
మీ ఒంటికి శిలువ శిక్ష తప్పవు...
ఆరడుగుల నేల మిమ్మల్ని
ఆహ్వానించే రోజున...
మీ అహంకారానికి బలైన
ఆత్మలన్నీ ఆనందతాండవం చేస్తాయి...

మూడో ప్రపంచ యుద్ధపు
ముప్పు ముందరే పొంచి ఉంది
మానవత్వంతో మేల్కొనకపోతే
మృత్యువు కోరల్లో అందరు బందీలే
జాగ్రత్త...తస్మాత్ జాగ్రత్త...!

రచన: కవి రత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్



## చట్టం సాహితీ లోకం
95814 19999

### ప్రపంచ వేదికపై తెలుగు తేజం చైతన్య రాజు



తెలుగు వైభవానికి అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల వేదిక మూడవ ప్రపంచ తెలుగు మహాసభ లు
ప్రపంచ వేదికగా తెలుగు మహోత్సవం
భాషాభిమానానికి ప్రతిరూపం తెలుగు సాంస్కృతికి వెలుగు దీపం
తెలుగు వైభవానికి వేదిక కిమ్స్ వైద్య కళాశాల
తెలుగు సాంస్కృతిక చిరునామా
విజయానికి చిరునామా చైతన్య రాజు/
మూడవ ప్రపంచ తెలుగు మహాసభల వైభవం
తెలుగు వైభవానికి విశ్వ ఉత్సవ వేదిక
ప్రపంచ వేదికపై తెలుగు జ్యోతి తెలుగు జాతికి స్ఫూర్తిదాయకం
తెలుగు నిలిస్తే సంస్కృతి నిలిస్తుందని మాతృభాష మన ఆత్మగౌరవం అని
తెలుగులోనే మాట్లాడుకుందాం తెలుగునం నిలుపుకుందాం
అని తెలుగు భాష పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తూ
ప్రపంచానికి తెలుగు గౌరవాన్ని చాటిన తెలుగు తేజం కోనసీమ ముద్దుబిడ్డ
అభినవ శ్రీకృష్ణదేవరాయలు
తెలుగు రారాజు చైతన్య రాజు/
చైతన్యంతో సాగిన మూడవ ప్రపంచ తెలుగు మహాసభల రెండు రోజుల వైభవం
ప్రపంచ వేదికపై వెలిగిన తెలుగు మహోత్సవం
తెలుగు తల్లి తేజం వసంతంలో ముందే కూసిన కవితా కోకిలల కవితాగానాలతో కవు లంతా
ఆనందాల ఆకాశంలో తరలైమెరవగా
చంద్రుడు భూమిపైకి దిగివచ్చి
తెలుగు వైభవాన్ని తిలకించినట్లు
వేదికపై చైతన్యవంతమైన చైతన్య రాజు
తెలుగు వైభవాన్ని చూసి చంద్రునికి కొత్త అనుభూతి/
తెలుగు గౌరవం
తెలుగు వైభవం చైతన్య రాజు
తెలుగు స్ఫూర్తి
తెలుగు కీర్తి
తెలుగు వైభవం
తెలుగు జ్యోతి
భాషాభిమానానికి మహోన్నత కిరీటం మూడో ప్రపంచ తెలుగు మహాసభల తెలుగు చైతన్య రాజు నాయకత్వం
తెలుగు సంస్కృతికి మహా గౌరవ వేదిక/
తెలుగు తల్లి తేజం
ప్రపంచానికి తాకిన వేళ
తెలుగు సంస్కృతి గర్వంగా గగనంలో ఎగిసే వేళ
తెలుగువారి ఆనందం కొత్త వసంతం /

(2026 ఫిబ్రవరి 28, మార్చి 1వ తేదీ లలో అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల వేదికపై నిర్వహించిన మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతమైన శుభ సందర్భంగా తెలుగు తేజం చైతన్య రాజును అభినందిస్తూ రచించిన కవిత)

అక్షర ప్రవీణ, నడక కవి
నల్లా నరసింహమూర్తి
సీనియర్ తెలుగు లెక్చరర్
శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు
కురసాల వారి వీధి అమలాపురం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
9247577501



## చట్టం సాహితీ లోకం
95814 19999

### పరదాల మాటున సరదాలు చేస్తున్నారు..!



నేను నేనేనా..?
నేను నేను కానేమో..?
అనే ఆలోచన పదే పదే
తొలి చేస్తుంది మనమున...

అనుమానం తో మది గది లోకి
తొంగిచూస్తే...ఎన్నో సత్కారాలు
సన్మానాలు, ప్రశంసలు
పొగడ్తలుతో గర్వంగా ఉప్పొంగుతుంది..

మంచి హోదా, మంచి పేరు
వెన్నంటి నిలిచిన విద్యార్థిని, విద్యార్థులు
ప్రోత్సహించిన ఉపాధ్యాయ బృందాలు
ఆదరించిన తల్లిదండ్రులు..ఇంతకన్నా ఇంకేమి కావాలి.?

పిల్లల గురుభక్తిని చూసి మురిచిన రోజులు
పిల్లల పలకరింతకే పరవశించిన రోజులు
పిల్లలతో కలిసిమెలిసి ఆడిన ఆటలు
ఎన్నెన్నో తుళ్ళింతలు,కేరింతలు...

పడక కుర్చీ లో పరాకుగా పడుకొని
గతించిన కాలాన్ని గుర్తు చేసుకొంటూ
నేటి విద్యార్థుల భవిష్యత్తును తలచుకొంటే
నిరాశ నిస్పృహ ఆవరించే తనువంతా...

చిందరవందర కేశాలతో
వంకరటింకర నడకలతో
చదువు సంధ్యలు గాలికి వదిలేసి
పరదాల మాటున సరదాలు చేస్తున్నారు

పిల్లలకు ఎన్ని మంచి మాటలు చెప్పినా
ఒంట పట్టించుకొనే వారే లేరాయే
నడకలు నడతలు మార్చుకోవడం మరిచి
తన వలే ఓ పదిమందిని తయారు చేస్తున్నారు

విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారా
భావితరాల బతుకులు బూడిదపాలవుతున్నాయా
భవిష్యత్తు ను అంధకారంలో బంధిస్తున్నారా.
ఎన్నో సమాధానం లేని ప్రశ్నలు... అందుకే

నీవు నేవేనని.. నీవు నీలాగే వుండమని
విద్యార్థుల కు ఆదర్శ పౌరులుగా మార్చమని
భవిష్యత్తు ను బంగరు భవితగా తీర్చదిద్దమని
పదే పదే నా మది హెచ్చరిస్తుంది..!

రచన:- వేనాప
వేంకట నారాయణ పరిమి
జి.ప.ఉ.పా.గుడీబండ
కోదాడ 98484 32533.

## చట్టం సాహితీ లోకం
95814 19999

### అంతర్జాతీయ మహిళా దినోత్సవ గీతం!



సాకి:
అఖిల లోకాలకు సృష్టికర్త బ్రహ్మయేనని తెలుసు!
ఆ బ్రహ్మకు ప్రతిరూపమే అమ్మయనీ తెలుసు!
ఆ అమ్మే మహిళా మణి!అనీతెలుసు!
అన్నితెలిసినా,, మహిళలంటే! ఎందుకంత అలుసు!

పల్లవి:
అంతర్జాతీయ మహిళాదినోత్సవం!
ఇది అతివల పాలిట అద్భుత మహోత్సవం!మార్చి ఎనిమిదిన పండుగచేస్తున్నాము!
మన మహిళల ఘనతలు,చరితల తెలుపుతు సగౌరవిద్దాము! మనమూ,,సేవలు చేద్దాము!
"అంత"

చ:1
ఆడది!అబల!ని అంటారా!
ఏ శక్తి లేనిదని అంటారా!
అంతటి!లోకాలే ఏలేటి,,ఆదిశక్తినే! మరిచేరా!
ఆ పరాశక్తినే!మరిచేరా!
"అంత"

చ:2
అష్ట దరిద్రాలంటారా!
ముదనష్టపాడదని తిడతారా!
అంతటి!సిరి సంపదలొసగేటి ఆదిలక్ష్మినే!మరిచేరా!
శ్రీ లక్ష్మీదేవినే!మరిచేరా!
"అంత"

చ:3
చదువులెందుకని?అంటారా!వంటిల్లే!నీకనిఅంటారా!
అంతటి!విద్యల నొసగే!తల్లి! సరస్వతమ్మను మరిచేరా!మన చదువుల తల్లిని మరిచేరా!
"అంత"

చ:4
అవన్ని,,చరితలనంటారా!
అతి చులకనగా,,మీరు తలిచేరా!
ఇంతటి!ఇండియానే!ఏలేటి!ద్రౌవది ముర్మునే!మరిచేరా!మన రాష్ట్రపతినే!మీరుమరిచేరా!
"అంత"

చ:5
చదువు రానిదని అంటారా!
ఏ చవటగనోజమకట్టేరా!ఇంతటి మీకు చదువులు నేర్పే మహిళామణులని మరిచేరా!
మన మేడమ్మలనే! మరిచేరా!
"అంత"

చ:6
ఆడబిడ్డ,లొద్దంటారా!
అది!ఆ,,,డ బిడ్డని అంటారా!
ఇంతటి మీకు జన్మనిచ్చినా!తల్లిని మీరు మరిచేరా!
కన్నతల్లి!ఆడదని మరిచేరా!
"అంత"

రచన: "వాగ్గేయరత్న"
డా.కడివేటిమునిరత్నం,
రచయిత,అంతర్జాతీయగాయకులు,తిరుపతి,
9676651514.



### నిర్ణయాలు

ఒక్క క్షణపు నిర్లక్ష్యం
అవుతాయి చక్కని
జీవితాలు చిన్నాభిన్నం.

ఒక సవ్యమైన ఆలోచన
ఒక విలువైన ఆలోచన
నిలుపు నిన్ను భువిపైన.

అనాలోచిత నిర్ణయాలు
అందరి జీవితాలను
ఆవలకు నెడతాయి.

ఆవేశపూరిత నిర్ణయాలు
పేగుబంధాలను సహితం
తెంపివేస్తాయి.

ఆప్యాయతతో కూడిన
నిర్ణయాలు ఎంతటి
వ్యథనైన దిగమింగుతాయి.

అనే ముందు ఆలోచించి
తీసుకుంటే నిర్ణయం
రాదు కదా అనాల్సిన అవసరం.

బంధాలు అనేవి
కోపానికి దూరంగాను
ప్రేమకు దగ్గరగాను ఉండాలి.

కోపం అగ్నివంటిది
ఎదుటివారిని కాల్చేలోపే
అది నిన్ను దహించివేస్తుంది.

వీధి దుర్గారావు ఎం. ఏ.
8309317473
--






## సృష్టి కి మూలమైన ఆమె క్షేమమేనా?:



సృష్టికి మూలం జగతికి ఆధారమామె
భవితకు వెలుగై న జీవనజ్యోతి ఆమె
తను మరణిస్తానని తెలిసి కూడాఆమె
మగనితో కలసి వంశాభివృద్ధి కి ముందుంటుంది.

జగతికి జననిగా త్రి భువనాలలో విరాజిల్లుతుంది.
తన వారి కోసమే త్రికాల దర్శిని
త్రినేత్రిని, రుద్ర స్వరూపిణి ఆమె.
వివేకవర్ధిని విశ్వవికాసిని ప్రేమతత్వం
సహనశీలి, త్యాగ నిరతికి ఆమెచిరునామ

అరుణోదయ బింబమే నుదుట తిలకమైవెలుగుతుంది
కురులచేరిన విరులు సువాసనలు విరజిమ్ము తాయి
నీలినయనాలకుఅద్దినకాటుక కలువ రేకులవుతున్నవి.
తన మనసు పరిమళాలకు ప్రకృతి పరవశిస్తుంది

నిండుపున్నమివిరాబుసినట్లుంటది మాట నడత
అష్టలక్ష్ములు నడ యాడి నట్లుంటుంది ఆమె నడక.
అవనికి అందమైన బహుమతిగా సృష్టి ఇచ్చిన వరం
ఆమె జననం కొందరికి మోదం..మరి కొందరికి ఖేదం.

ప్రతిరోజూపండగే కొందరికి.మరికొందరికి శాపం
పూటగడవని పస్థుల నిశీద రాత్రులు ఎన్నో కొందరికి
అతుకుల బతుకులు అటుపోట్లు నిష్ఠుర మాటలు
ఆమెలేని లేని జగతిని ఊహించగలదా సమాజం

ఆమె క్షేమమేనా అంటే లేదు లేదంటారు విఘ్నులు
ఆమెబతుకు భారమైన ముమ్మాటికీ సృష్టి కి క్షామమే..
కరుడు కట్టిన కసాయి తల్లి తండ్రులున్నంతవరకు
సమాజాన మానవవిలువలను మంటగలిపిన వేళ
ఆత్మ బంధాలు లేక ఆర్థిక బంధాలు బలపడిన వేళ

తన యు లే తల్లిని ఆటబొమ్మగా చూస్తున్న వేళ
పరాయి సంస్కృతి ప్రభావంతో పెరుగుతున్న హేళ
స్వార్థం పెరిగిన యువత ప్రేమఅనే ముసుగులో జరుగు ఆసిడ్ దాడులవేళ
మత్తుకు బానిసగామారి వావివరుసలు మరుస్తున్న వేళ

పసికందునుండి పండుముదుసలి వరకు
సమాజ చీడ పురుగులు కొందరు కామ పైచాచిక
ప్రవృత్తితో గుంటనక్కలుగా చూస్తున్న వేళ
చట్టాలెన్నోచ్చినా చట్టసభలలోఆమె చోటు
అంతంత మాత్రమైనవేళ

సమాజానికి చాందస భావాలనే విషపురక్తం ఎక్కించిన వేళ
సామాజికరుగ్మతలకుసరైనమానసికచికిత్సజరగ ని వేళ
ఆమె క్షేమమే అని ఎవరైనా అన్నా..
లేదు లేదు ఆమెకు మంచి జరుగని నాడు
జగతికే క్షామమని అంటాను నేను.

మహిళా మూర్తులందరికీ మహిళా దినోత్సవశు భాకాంక్షలు.

డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం.
కవి, రచయిత. వి. కోట
చిత్తూరు జిల్లా.
9000169823.




# కీలక మలుపుతో టీమ్ఇండియా విజయం

టీ20 ప్రపంచకప్‌లోని రెండో సెమీఫైనల్ చివరి వరకు ఎంతో ఉత్కంఠభరితంగా సాగింది. చివరికి, భారత్ 7 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. గత నెల ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ టోర్నీ ఇప్పుడు తుది అంకానికి చేరుకుంది. మార్చి 8వ తేదీన అహ్మదాబాద్ వేదికగా జరగనున్న టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ కోసం టీమ్ఇండియా, న్యూజిలాండ్ జట్లు సన్నద్ధమవుతున్నాయి. ముంబయిలోని వాంఖడే వేదికగా ఇంగ్లాండ్- భారత్ మధ్య జరిగిన రెండో సెమీఫైనల్ మ్యాచ్ ఆద్యంతం ఎంతో రసవత్తరంగా జరిగింది. తొలి ఇన్నింగ్స్ వరకు మ్యాచ్ ఏకపక్షంగా భారత్ వైపు ఉందని అంతా భావించారు. అందుకు ప్రధాన కారణం భారత బ్యాటర్లు రాణించడం సహా 253 పరుగులను రాబట్టి ప్రత్యర్థి జట్టు ఇంగ్లాండ్‌కు భారీ టార్గెట్ నిర్దేశించడం. 253 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలో దిగిన ఇంగ్లాండ్ జట్టు అసాధ్యం అన్నట్లుగా కనిపించింది. కాగా, రెండో ఇన్నింగ్స్‌లో 250 పరుగులు సాధించడం అంత తేలికైన స్కోరు కాదు. కానీ ఇంగ్లాండ్ లాంటి బలమైన ఆటను ఆడి మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చారు. జట్టు ప్రారంభంలోనే వరుసగా వికెట్లు కోల్పోయినప్పటికీ, జాకబ్ బెథెల్, విల్ జాక్స్ అద్భుతంగా రాణించారు. ఓవర్‌కు సగటున 12 పరుగులు చేశారు. అయితే ఇంగ్లాండ్ 7 పరుగుల తేడాతో ఫైనల్‌కు చేరుకునే అవకాశాన్ని కోల్పోయారు. టీ20 ప్రపంచకప్ రెండో సెమీఫైనల్లో భారత జట్టు మ్యాచ్ గెలిచి ఫైనల్‌కు చేరుకోవడానికి 3 ప్రధాన కారణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

1) టీమ్ఇండియా తొలుత బ్యాటింగ్ చేస్తున్న క్రమంలో ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ సంజు సామ్సన్ క్యాచ్‌ను పట్టుకోవడంలో విఫలమయ్యాడు. అదే సమయంలో సంజూ కేవలం 15 పరుగుల వద్ద ఉన్నాడు. అప్పుడు ఆ క్యాచ్ పట్టి ఉండే భారత జట్టు 253 పరుగులు రాబట్టడం అసాధ్యంగా మారే అవకాశం ఉంది. కచ్చితంగా చెప్పాలంటే సంజూ శాంసన్ క్యాచ్ డ్రాప్ చేయడం వల్ల ఇంగ్లాండ్ జట్టు టోర్నీ నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2) ఇంగ్లాండ్ బ్యాటింగ్ సమయంలో అక్షర్ పటేల్ పట్టిన క్యాచ్ అసలైన మ్యాచ్‌కి కీలక మలుపు. ఎందుకంటే అప్పటికే సూపర్-8లో పాకిస్థాన్ జట్టుపై ఇంగ్లాండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ సెంచరీతో రెచ్చిపోయాడు. అయితే హ్యారీ బ్రూక్ క్యాచ్ పట్టేందుకు పెవీలియన్ వద్ద అక్షర్ పటేల్ దాదాపుగా 24 మీటర్లు పరిగెత్తిమరీ క్యాచ్ పట్టాడు. ఈ క్యాచ్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది. అదేవిధంగా బ్రూక్ వెనుదిరిగిన వెంటనే విల్ జేక్స్ అద్భుతంగా రాణించాడు. అర్ష్‌దీప్ సింగ్ వేసిన బంతిని సిక్స్‌గా కొట్టడానికి ప్రయత్నించాడు. అతను బంతిని పరిగెత్తించి బౌండరీ వద్ద క్యాచ్ ఇచ్చి






సమీపంలో ఉన్న శివం దూబేకి ఇచ్చి క్యాచ్‌ను విజయవంతంగా తీసుకునేలా చేశాడు. విల్ జేక్స్ నిలబడి ఉంటే, ఇంగ్లాండ్ ఖచ్చితంగా మ్యాచ్ గెలిచి ఉండేది.

3) చివరిగా భారత ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా 4 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అతను ఒక వికెట్ తీసుకుని 33 పరుగులు మాత్రమే ఇచ్చాడు. ఆ తర్వాత బౌలింగ్ చేసిన హార్దిక్ పాండ్యా కేవలం 4 ఓవర్లలో 2 వికెట్లు తీసుకుని 38 పరుగులు మాత్రమే ఇచ్చాడు. భారత జట్టు ఫైనల్ మ్యాచ్ కు చేరుకోవడానికి ఇదే ప్రధాన కారణం. 2026 టీ20 ప్రపంచ కప్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించి భారత్ ఫైనల్‌కు చేరుకుంది. ఈ మ్యాచ్‌లో వారు న్యూజిలాండ్‌తో తలపడనున్నారు. ఈ మ్యాచ్ మార్చి 8 ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరుగుతుంది. రాత్రి 7 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం కానుంది.

## హార్దిక్ పాండ్యాపై ప్రశంసల జల్లు



ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన సెమీఫైనల్ పోరులో హార్దిక్ పాండ్యా అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఇంగ్లాండ్‌పై భారత్ సాధించిన ఉత్కంఠభరిత విజయం తర్వాత టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ముఖ్యంగా ఆర్సీబీ దిగ్గజం, దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ హార్దిక్ పాండ్యాను 'బిగ్ మ్యాచ్ ప్లేయర్'గా అభివర్ణించాడు.మ్యాచ్ ముగిసిన అనంతరం డుప్లెసిస్ మాట్లాడుతూ.. హార్దిక్ పాండ్యాలోని పోరాట పటిమను, క్లిష్ట పరిస్థితుల్లో అతను చూపించే సమయస్ఫూర్తిని కొనియాడారు. "ఒక ఆటగాడికి నైపుణ్యం ఎంత ముఖ్యమో, ఒత్తిడిని తట్టుకునే మనస్తత్వం కూడా అంతే ముఖ్యం. కొన్నిసార్లు టాలెంట్ కంటే ఆటగాడి క్యారెక్టర్‌ను బట్టి వారిని ఎంపిక చేయడం సరైన నిర్ణయం అవుతుంది. పాండ్యా అటువంటి క్యారెక్టర్ ఉన్న ప్లేయర్, అతను పెద్ద స్టేజ్ కోసమే పుట్టినట్లుగా కనిపిస్తాడు" అని డుప్లెసిస్ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ తన విలువను నిరూపించుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌లో కేవలం 12 బంతుల్లోనే 27 పరుగులు (3 ఫోర్లు, 2 సిక్సర్లు) చేసి, భారత జట్టు స్కోరును 253 పరుగుల భారీ లక్ష్యం వైపు తీసుకెళ్లడంలో తనవంతు పాత్ర పోషించాడు. ఆ తర్వాత బౌలింగ్‌లో అత్యంత కీలకమైన సమయంలో బరిలోకి దిగి, ఇంగ్లాండ్ బ్యాటర్లు ఫిల్ సాల్ట్, సామ్ కరన్‌ల వికెట్లను తీసి ప్రత్యర్థి జట్టును ఒత్తిడిలోకి నెట్టాడు. ముఖ్యంగా ఇంగ్లాండ్ గెలుపు దిశగా సాగుతున్న సమయంలో హార్దిక్ వేసిన పెనాల్టీ ఓవర్ మ్యాచ్ గమనాన్నే మార్చేసింది. 41 ఏళ్ల డుప్లెసిస్ మాట్లాడుతూ, కోచ్‌లు ఆటగాళ్లను ఎంపిక చేసేటప్పుడు కేవలం టాలెంట్‌ను మాత్రమే కాకుండా, వారిలో ఉన్న 'ధైర్యాన్ని' డా చూస్తారని వివరించాడు హార్దిక్ పాండ్యా వంటి ఆటగాళ్లు ఒత్తిడి పెరిగే కొద్దీ మరింత మెరుగ్గా రాణిస్తారని.. అటువంటి ధైర్యం, క్యారెక్టర్ ఉన్న వ్యక్తులు జట్టుకు ఎంతగానో ఉపయోగపడతారని డుప్లెసిస్ అభిప్రాయపడ్డాడు.2024 వరల్డ్ కప్‌లోనూ భారత్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన హార్దిక్ పాండ్యా.. ఇప్పుడు 2026లో కూడా అదే జోరును కొనసాగిస్తూ టీమిండియాకు ప్రధాన ఆయుధంగా మారాడు. ఈ సెమీఫైనల్ విజయంతో భారత్ ఫైనల్‌కు చేరుకుంది. హార్దిక్ పాండ్యా ప్రదర్శన అభిమానులకు, మాజీ ఆటగాళ్లకు కూడా ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

# అర్ష్‌దీప్‌ను ఆటపట్టించిన అభిషేక్

ముంబయి వాంఖడే వేదికగా ఇంగ్లాండ్?తో జరిగిన సెమీఫైనల్?లో భారత్ విజయం సాధించిన ఫైనల్స్?కు దూసుకెళ్లింది. మార్చి 08న నరేంద్రమోదీ స్టేడియంలో టైటిల్ ఫైట్?లో న్యూజిలాండ్?ను ఢీ కొట్టనుంది. అయితే ఫైనల్ మ్యాచ్ కోసం భారత క్రికెట్ జట్టు ముంబయి నుంచి అహ్మదాబాద్?కు బయల్దేరింది. ఈ జర్నీలో టీమ్ఇండియా ఆటగాళ్లు అభిషేక్ శర్మ- అర్ష్‌దీప్ సింగ్ మధ్య సరదా సంభాషణ జరిగింది. దీనికి సంబంధించిన వీడియో నవ్వులు పూయిస్తుంది.సెమీఫైనల్?లో అర్ష్‌దీప్ అంచనాలకు తగ్గట్టుగా రాణించలేదు. అతడి నాలుగు ఓవర్ల కోటాలో 51 పరుగులిచ్చి ఒకే ఒక వికెట తీశాడు. అంటే 12.80 ఎకనమీతో బౌలింగ్ చేశాడు. ఈ క్రమంలోనే అతడు మొత్తం 5 వైడ్ బాల్స్ వేశాడు. అయితే బౌలింగ్?లో వైడ్లు వేయడంపై అభిషేక్ సరదాగా అర్ష్‌దీప్?ను ఆటపట్టించాడు. అర్ష్‌దీప్ బౌలింగ్ చేస్తుంటే, జట్టులో ఇద్దరు వికెట్ కీపర్లు ఉండాలని అన్నాడు.టీమ్ బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో అభిషేక్?ను అర్ష్‌దీప్ ఏదో అన్నాడు. దానికి బదులిస్తూ




అభిషేక్, 'అర్ష్‌దీప్ నువ్వు బౌలింగ్ చేస్తుంటే మనకు ఇద్దరు వికెట్ కీపర్లు కావాలి. ఒకరు స్టంప్స్?కు స్ట్రయిట్?లో ఉండాలి, ఇంకొకరు వైడ్ వద్ద కూడా కావాలి' అని నవ్వుతూ అన్నాడు. దీనికి అర్ష్‌దీప్ 'సంజు భాయ్, ?మనకు ఇద్దరు వికెట్ కీపర్లు కావాలా? సరే ఏం ఫర్వాలేదు లే, మన జట్టులో ఇద్దరు కీపర్లు ఉన్నారు' అంటూ ఇషాన్ కిషన్?ను చూపిస్తూ రిప్లై ఇచ్చాడు. దీనిని అర్ష్‌దీప్ తన సోషల్ మీడియా అకౌంట్ స్నాప్?చాట్ స్టోరీలో పోస్ట్ చేయడంతో ఇది వైరల్ అయ్యింది. అయితే ఈ వరల్డ్?కప్?లో నిజంగానే అర్ష్‌దీప్ బౌలింగ్ ఆశించిన స్థాయిలో లేదు. సెమీస్? కంటే ముందు వెస్టిండీస్?తో ఆడిన సూపర్ 8 మ్యాచ్?లోనూ అతడి బౌలింగ్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ఆ మ్యాచ్?లో 4 ఓవర్లు బౌలింగ్ చేయగా, 43 పరుగులు ఇచ్చాడు. ఇందులో ఒక్క వికెట్ కూడా లేదు. అలాగే అతడు సంధించిన బంతుల్లో 7 వైడ్?గా వెళ్లడం గమనార్హం. ఈ లెక్కన అర్ష్‌దీప్ ఆడిన చివరి రెండు మ్యాచ్?ల్లోనే మొత్తం 12 వైడ్ బాల్స్ వేశాడన్నమాట! కాగా, ప్రస్తుత వరల్డ్?కప్ టోర్నమెంట్?లో అర్ష్‌దీప్ ఏడు మ్యాచ్?ల్లో 9 వికెట్లు పడగొట్టాడు.

## చరిత్ర సృష్టించిన సంజూ శాంసన్..

టీమిండియా విధ్వంసకర ఓపెనర్ సంజూ శాంసన్ చరిత్ర సృష్టించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే సింగిల్ ఎడిషన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో రోహిత్ శర్మ రికార్డ్‌ను అధిగమించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో ఇప్పటి వరకు 4 మ్యాచ్‌లు మాత్రమే ఆడిన సంజూ శాంసన్.. 16 సిక్స్‌లు బాదాడు. తద్వారా రోహిత్ శర్మ పేరిట ఉన్న 15 సిక్స్‌ల రికార్డును అధిగమించాడు. ఇంగ్లండ్‌తో గురువారం వాంఖడే వేదికగా జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్ 7 సిక్స్‌లు కొట్టడం ద్వారా ఈ ఘనతను అందుకున్నాడు. లీగ్ దశలో నమీబియాతో ఒక మ్యాచ్ ఆడిన సంజూ శాంసన్.. సూపర్-8లో జింబాబ్వే, వెస్టిండీస్‌పై బరిలోకి దిగాడు. నమీబియాతో మ్యాచ్‌లో మూడు సిక్స్‌లు బాదిన సంజూ.. జింబాబ్వేతో రెండు, వెస్టిండీస్‌పై నాలుగు సిక్స్‌లు కొట్టాడు. రోహిత్ శర్మ 2024 టీ20 ప్రపంచకప్‌లో 15 సిక్స్‌లు బాది ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా.. సంజూ శాంసన్ అధిగమించాడు.




సింగిల్ ఎడిషన్ టీ20 ప్రపంచకప్‌లో సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్ల జాబితాలో సంజూ శాంసన్(16) తర్వాత శివమ్ దూబే(15), రోహిత్ శర్మ(15), ఇషాన్ కిషన్(14), హార్దిక్ పాండ్యా(14), యువరాజ్ సింగ్ ఉన్నారు. ఇందులో రోహిత్(2026), యువరాజ్ సింగ్(2007) మినహా మిగతా బ్యాటర్లంతా ఈ ఎడిషన్‌లో సిక్స్‌లు బాదడం గమనార్హం. ఓవరాల్‌గా ఈ జాబితాలో ఫిన్ అలెన్ 20 సిక్సర్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. షిమ్రాన్ హెట్‌మైర్(19), ఫర్మాన్(18), నికోలస్ పూరన్(17) సంజూ శాంసన్ కంటే ముందున్నారు. న్యూజిలాండ్‌తో జరిగే ఫైనల్లో సంజూ తన జోరు కొనసాగిస్తే.. ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవనున్నాడు. ఈ ఎడిషన్‌లో నాలుగు మ్యాచ్‌లే ఆడిన సంజూ రెండు హాఫ్ సెంచరీలతో 232 పరుగులు చేశాడు. పేలవ ఫామ్‌తో తుది జట్టులో చోటు కోల్పోయిన సంజూ.. లెఫ్ట్ రైట్ కాంబినేషన్‌లో భాగంగా అవకాశం అందుకొని ఆకాశమే హద్దుగా చెలరేగాడు.

## పాక్ ఆటగాడిపై టీమిండియా దిగ్గజం ఫైర్!

టీ20 వరల్డ్ కప్ 2026 సెమీఫైనల్లో ఇంగ్లాండ్ జట్టుపై భారత్ అద్భుత విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లిన వేళ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికరమైన పోరు సాగుతోంది. భారత మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ పాకిస్థాన్ మాజీ పేసర్ మహమ్మద్ ఆమిర్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత్ సెమీఫైనల్‌కు చేరదని.. ఇంగ్లాండ్ గెలుస్తుందని ఆమిర్ చేసిన జోస్యాలను సిద్ధూ ఎద్దేవా చేశారు.ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఒక వీడియోలో నవజ్యోత్ సింగ్ సిద్ధూ మాట్లాడుతూ.. మహమ్మద్ ఆమిర్‌ను "దొంగ బాబా" అని సంబోధించారు. "మన చుట్టూ ఉన్న కొందరు వ్యక్తులకు తప్పుడు అంచనాలు వేయడం అలవాటుగా మారింది. అది నిజమైతే తాము గొప్ప




జ్ఞానులమని చెప్పుకుంటారు, లేదంటే సైలెంట్‌గా ఉంటారు. అమీర్ చెప్పినవన్నీ తప్పని రుజువయ్యాయి. వెస్టిండీస్, దక్షిణాఫ్రికా జట్లు ముందడుగు వేస్తాయని చెప్పారు.. కానీ సంజూ శాంసన్ రాకతో ఆ రెండు జట్లు ఇంటికి వెళ్లాయి. ఇంగ్లాండ్ గెలుస్తుందని ఈరోజు చెప్పారు.. కానీ ఇంగ్లాండ్ కూడా ఓడిపోయింది" అని సిద్ధూ ఎద్దేవా చేశారు.సిద్ధూ తనదైన శైలిలో మహమ్మద్ ఆమిర్‌పై విమర్శలు చేస్తూ కొన్ని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. "జోస్యాలు ఏమీ నిర్ణయించవు, ఫలితాలు మైదానంలో తేలుతాయి. భిక్షాటనతో సింహాసనం దక్కదు. ఖాళీ పాత్రలే ఎక్కువ శబ్దం చేస్తాయి. ఆమిర్ పరిస్థితి కూడా అలాగే ఉంది" అని మండిపడ్డారు. మ్యాచ్‌లు గెలవాలంటే మైదానంలో సత్తా చాటాలని, కేవలం మాటలతో కాదని హితవు పలికారు.భారత్ విజయం సాధించినప్పటికీ మహమ్మద్ ఆమిర్ తన పంతాన్ని వీడలేదు. భారత్ గొప్పగా ఆడిందని అంగీకరిస్తూనే, ఇంగ్లాండ్ ఫీల్డింగ్ తప్పిదాల వల్లే ఓడిపోయిందని వాదించారు. "నేను క్రికెట్ గురించే మాట్లాడుతున్నాను. ఇంగ్లాండ్ ఓ ముఖ్యమైన క్యాచ్ వదిలేయడం వల్లే మ్యాచ్ ఓడిపోయింది. ఫామ్ లో ఉన్న బ్యాటర్ (సంజూ శామ్సన్) క్యాచ్‌ను హ్యారీ బ్రూక్ పట్టుకుని ఉంటే, ఇంగ్లాండ్ మరో ఓవర్ మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించేది. ఇరు జట్ల మధ్య తేడా కేవలం బుమ్రా మాత్రమే" అని ఆమిర్ తన కామెంట్లను సమర్థించుకున్నాడు.








# పెద్ది నుంచి జాన్వీకపూర్ వీడియో విడుదల

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'లో కథానాయిక జాన్వీ కపూర్ ఈరోజు తన 29వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఆమెకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ ఒక స్పెషల్ వీడియోను విడుదల చేసింది. కాటుక అక్కర్లేని ఆ కళ్లు, ముక్కుపుడక అక్కర్లేని ఆ ముక్కు.. అంటే అలంకరణ అక్కర్లేని అరుదైన చికిరియే ఈ చికిరి.. అంటూ దర్శకుడు బుచ్చిబాబు సనా జాన్వీని ప్రశంసిస్తూ ఉన్న ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో జాన్వీ 'అచ్చియమ్మ' అనే పల్లెటూరి యువతి పాత్రలో నటిస్తుంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సహకారంతో వృద్ధి సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 30 న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో జాన్వీ కపూర్ 'అచియమ్మ' అనే పాత్రలో కనిపించబోతోంది. బుచ్చిబాబు తన ట్వీట్‌లో.. 'నీతో వర్క్ చేయడం చాలా సంతోషంగా ఉంది. స్క్రీన్ మీద అచియమ్మగా నీ పవర్‌ఫుల్ అవతారాన్ని ప్రపంచం





చూడబోతున్నందుకు నేను చాలా ఎ÷-జగైటెడ్‌గా ఉన్నాను' అంటూ పేర్కొన్నారు. విడుదలైన పోస్టర్‌లో జాన్వీ లుక్ అందరినీ ఆకట్టుకుంటోంది. గతంలో శ్రీదేవి - చిరంజీవి జోడీ వెండితెరపై సృష్టించిన మ్యాజిక్ గురించి తెలిసిందే. ఇప్పుడు వారి వారసులు రామ్ చరణ్ - జాన్వీ కపూర్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## పుట్టినరోజున శ్రీవారిని దర్శించుకున్న జాన్వీ

జాన్వీ కపూర్ తన పుట్టినరోజు సందర్భంగా కలియుగ దైవం శ్రీవారిని దర్శించుకున్నారు. మార్చి 6 తన 29వ పుట్టినరోజును పురస్కరించుకుని తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం కోసం కాలిబాటన తిరుమలకు చేరుకున్నారు. తన పిన్ని నటి మహేశ్వరితో మెట్లమార్గంలో కొండపైకి చేరుకున్న జాన్వీ తెల్లవారుజామున వి.ఐ.పి బ్రేక్ దర్శనంలో స్వామివారిని దర్శించుకుంది. దర్శనం అనంతరం జాన్వీకి రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందించారు. సాంప్రదాయ పట్టు వస్త్రాల్లో మెరిసిపోతున్న జాన్వీని చూసేందుకు భక్తులు ఎగబడగా, ఆమె ఎంతో ఓపికతో వారితో సెల్ఫీలు దిగుతూ కన్పించారు. ప్రస్తుతం తెలుగు సినిమాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఈ భామ, ఇప్పటికే 'దేవర' చిత్రంతో అదరగొట్టి, త్వరలో రామ్ చరణ్ సరసన బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రాబోతున్న భారీ చిత్రం 'పెద్ది' ద్వారా ప్రేక్షకులను పలకరించనున్నారు.


# వృషకర్మ గ్లింప్స్ అద్భుతం: సుకుమార్






యువసామ్రాట్ నాగచైతన్య నటిస్తున్న మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' ఫస్ట్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ గ్లింప్స్ చూసిన ప్రముఖ దర్శకుడు సుకుమార్, చిత్ర బృందంపై ప్రశంసల వర్షం కురిపించారు. సుకుమార్ రైటింగ్స్ కూడా ఈ నిర్మాణంలో భాగస్వామి కావడంతో, ఆయన ఈ అవుట్‌పుట్ పట్ల ఎంతో సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.సుకుమార్ అభినందనలపై నాగచైతన్య ట్విట్టర్ (ఎ) వేదికగా స్పందిస్తూ.. 'థాంక్యూ సుకుమార్ గారు. మీలాంటి విజనరీ నుంచి ఇలాంటి మాటలు రావడం మాకు ఎంతో గౌరవంగా ఉంది. మీ ప్రశంసలు మాకు ఎంతో స్ఫూర్తినిస్తాయి' అంటూ కృతజ్ఞతలు తెలిపారు. కార్తీక్ దండు రూపొందించిన ఈ సూపర్ నేచురల్ ప్రపంచం సుకుమార్‌ను సైతం ఆశ్చర్యపరిచిందని చైతూ ట్వీట్ ద్వారా స్పష్టమవుతోంది. గతంలో కార్తీక్ దండు రూపొందించిన 'విరూపాక్ష' చిత్రానికి సుకుమార్ స్క్రీన్ ప్లే అందించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'వృషకర్మ'తో తన శిష్యుడు మరో అద్భుతాన్ని వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడని సుకుమార్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. దీంతో ఈ గురు-శిష్యుల బాండింగ్.. చైతన్యతో వారి అనుబంధం సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది.

# మాస్ రోల్‌లో శర్వానంద్..భోగి




ఇటీవలే 'నారీ నారీ నడుమ మురారి'తో క్లాస్ హిట్ అందుకున్న శర్వానంద్, ఇప్పుడు రూట్ మార్చి పూర్తి స్థాయి మాస్ రోల్‌లో కనిపించబోతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'భోగి' చిత్రంలో నటిస్తుండగా. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'ధమాకా' ఫేమ్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండటంతో పాటలపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన శర్వానంద్ లుక్ చూస్తుంటే, బాక్సాఫీస్ వద్ద ఈసారి మాస్ జాతర ఖాయమనిపిస్తోంది. దీనికి తోడు నేడు శర్వానంద్ పుట్టినరోజును పురస్కరించుకుని మేకర్స్ ఒక స్పెషల్ రఫ్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. దర్శకుడు సంపత్ నంది ఈ పోస్టర్‌ను షేర్ చేస్తూ.. 'మొన్న గంగని చూశారు.. ఇప్పుడు పెను గంగని చూడండి' అంటూ తన హీరో క్యారెక్టర్‌కు పవర్‌ఫుల్ ఎలివేషన్ ఇచ్చారు. ఈ పోస్టర్‌లో శర్వానంద్ గడ్డంతో, ఇంటెన్స్ లుక్‌లో చాలా డైనమిక్ గా కనిపిస్తున్నారు. శర్వానంద్ కెరీర్‌లోనే ఇది మోస్ట్ మాస్ ఫిల్మ్ అవుతుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇక శ్రీ శ్రీనివాస సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 28, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ప్రజంట్ శర్వ లుక్ వైరల్ అవుతుంది.

# ఆసక్తిగా సాగే.. సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని




టాలీవుడ్ సీనియర్ నటీనటులు శివాజీ, లయ సుదీర్ఘ విరామం తర్వాత జంటగా నటించిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ క్రైమ్ కామెడీ డ్రామాను శివాజీ స్వయంగా నిర్మించారు. భారీ అంచనాల మధ్య శుక్రవారం విడుదలైంది. హార్సిలి హిల్స్‌లో నివసించే శ్రీరామ్ (శివాజీ) ఒక నిజాయితీ గల పంచాయతీ కార్యదర్శి. తన భార్య ఉత్తర (లయ), రీల్స్ పిచ్చితో వింత పనులు చేసే కొడుకు నితిన్ అలియాస్ బిట్టు (రోహన్)తో కలిసి సాధారణ జీవితం గడుపుతుంటాడు. అయితే, ఆడవాళ్ల పిచ్చి ఉన్న స్థానిక ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్), శ్రీరామ్ లేని సమయంలో ఉత్తరపై కన్నేసి వారి ఇంటికి వస్తాడు. కానీ ఊహించని విధంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. అసలు కథ ఇక్కడే మొదలవుతుంది. ఆ హత్య కేసు నుండి తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి శ్రీరామ్ ఏం చేశాడు? శవాన్ని మాయం చేసే క్రమంలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులేంటి? మరోవైపు కోటి రూపాయల గిఫ్ట్ బ్యాగ్ కోసం ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట ఎందుకు పడింది? ఈ గందరగోళంలో కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్) పాత్ర ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ చిత్రం. దర్శకుడు సుధీర్ శ్రీరామ్ ఒక డార్క్ క్రైమ్ థ్రిల్లర్‌ను వినోదాత్మకంగా మలచడంలో సఫలమయ్యాడని చెప్పవచ్చు. కథలో పెద్దగా కొత్తదనం లేకపోయినప్పటికీ, పాత్రల చిత్రణ మరియు కథనాన్ని నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సినిమా ఆరంభంలో పాత్రల పరిచయం, ఆ తర్వాత వచ్చే మలుపులు ప్రేక్షకుడిని కథలోకి తీసుకెళ్తాయి. అయితే ఎప్పుడైతే హత్య జరుగుతుందో, అక్కడి నుండి కథ థ్రిల్లింగ్ మోడ్‌లోకి మారుతుంది. శవాన్ని మాయం చేసేందుకు హీరో వేసే ప్లాన్లు, మరోవైపు ఎమ్మెల్యే మనుషుల నుంచి తప్పించుకునే సీన్లు ఆసక్తిని కలిగిస్తాయి. అయితే, ద్వితీయార్థంలో అక్కడక్కడా కథనం కాస్త నెమ్మదించినట్లు అనిపిస్తుంది. శివాజీ తనదైన టైమింగ్ మరియు అనుభవంతో శ్రీరామ్ పాత్రలో ఒదిగిపోయారు. మధ్యతరగతి తండ్రి పడే తపనను చక్కగా పండించారు. చాలా కాలం తర్వాత తెరపై కనిపించినా, తన నటనతో అలరించింది లయ. ఇక కొడుకు పాత్రలో రోహన్ తన అల్లరితో నవ్వించగా, ధనరాజ్ పాత్ర చివరిలో సర్ప్రైజ్ చేస్తుంది. శరత్ లోహితాశ్వ, ప్రిన్స్ తమ పరిధి మేరకు నటించారు.

# క్రైమ్ థ్రిల్లర్‌గా మృత్యుంజయ్

గత వారం 'విష్ణు విన్యాసం'తో నవ్వులు పూయించిన టాలీవుడ్ నటుడు శ్రీవిష్ణు గ్యాప్ లేకుండా మరో కొత్త సినిమాతో ఈ వారం ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం మృత్యుంజయ్. రెబా మోనికా జాన్ కథానాయికగా నటించగా.. హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహించాడు. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. క్రైమ్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంది అనేది రివ్యూలో చూద్దాం. శ్రీవిష్ణు ఒక న్యూస్ రిపోర్టర్. క్రైమ్ బ్యూరోలో పనిచేయాలనేది తన కల, కానీ అవకాశం దొరకక ప్రస్తుతానికి అడ్వర్టైజ్‌మెంట్ విభాగంలో పనిచేస్తుంటాడు. ఎవరైనా మరణిస్తే, వారి ఇంటికి వెళ్లి ఆ వ్యక్తి గొప్పతనం గురించి రాసి, కుటుంబ సభ్యుల నుండి శ్రద్ధాంజలి ప్రకటనలు సేకరించడం అతడి వృత్తి. ఈ క్రమంలో అచ్యుత్ రావు (బాలాదిత్య) మరణం జయ్‌ను కదిలిస్తుంది. అచ్యుత్ కూతురు అంజలి తన తండ్రి మరణం వెనుక ఉన్న కారణాన్ని అడగడంతో, జయ్ ఆ బాధ్యతను భుజానికెత్తుకుంటాడు. వరుసగా జరుగుతున్న కొన్ని మరణాలు ప్రమాదాలు కావని, పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతున్న హత్యలని జయ్ గుర్తిస్తాడు. ఈ కేసును ఇన్వెస్టిగేట్ చేస్తున్న ఐపీఎస్ అధికారి సీత (రెబా మోనికా జాన్)తో కలిసి జయ్ ఆ హంతకుడిని ఎలా పట్టుకున్నాడు? ఆ కిల్లర్ అసలు లక్ష్యం ఏమిటి? అన్నదే మిగతా కథ. ర్శకుడు హుస్సేన్ షా కిరణ్ ఒక విభిన్నమైన పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించారు. కేవలం హత్యలు, ఇన్వెస్టిగేషన్ మాత్రమే కాకుండా, హీరో-విలన్ మధ్య సాగే మైండ్ గేమ్ సినిమాకు ప్రధాన బలమై నిలిచింది. సినిమా ప్రారంభంలో పాత్రల పరిచయం, హీరో చేసే వింతైన ఉద్యోగం ఆసక్తికరంగా ఉంటాయి. అయితే కథ అసలు పాయింట్‌కి రావడానికి కొంత సమయం తీసుకుంటుంది. ద్వితియార్థంలో సినిమా వేగం పెరుగుతుంది. హీరో-విలన్ ఒకరికొకరు తెలియకుండానే ఎదురుపడే సన్నివేశాలు, ఒకరి ఎత్తులకు మరొకరు పై?త్తులు వేయడం ఉత్కంఠను కలిగిస్తాయి. ముఖ్యంగా క్లైమాక్స్ వరకు సస్పెన్స్ మెయింటైన్ చేయడంలో దర్శకుడు సఫలమయ్యారు. శ్రీవిష్ణు తన మార్కు కామెడీని పక్కన పెట్టి, చాలా సీరియస్ రోల్‌లో ఒదిగిపోయాడు. ఆయన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ పాత్రకు తగ్గట్లుగా ఉన్నాయి. రెబా మోనికా జాన్ కేవలం గ్లామర్ కోసమే కాకుండా, ఒక బాధ్యతాయుతమైన పోలీస్ ఆఫీసర్ పాత్రలో మెప్పించింది. వీర్ ఆర్యన్ ప్రతినాయకుడిగా వీర్ ఆర్యన్ నటన ఆకట్టుకుంటుంది. కొన్ని సీన్స్‌లో తన నటనతో భయపెట్టారు.




Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999